ONE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL/26/A2455

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF PEN

PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 01 సంచిక : 92
శుక్రవారం 31 జూలై 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## ఇరాన్‌కు చైనా క్షిపణులు.. వయా పాకిస్థాన్: స్పందించిన ట్రంప్



**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 30)**

ఇంటర్నెట్‌డెస్క్: అమెరికా విమానాలు, హెలికాప్టర్లకు తలనొప్పిగా మారిన కొన్ని ఆయుధాలను చైనా నుంచి ఇరాన్ కు సరఫరా చేసేందుకు రంగం సిద్ధమైంది. వీటి రవాణాకు పాకిస్థాన్‌ను మార్గంగా ఎంచుకొన్నట్లు అంతర్జాతీయ వార్తా సంస్థ సంచలన కథనం ప్రచురించింది. దీంతో అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. పాక్ పేరు ఎత్తకుండా చైనాపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ▶2లో

## పాదయాత్రను వాయిదా వేస్తున్నా: అంబటి రాంబాబు



### తన నివాసంపై దాడి చేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోలేదని అంబటి ఆగ్రహం

**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 30)**

తన నివాసంపై జరిగిన దాడికి సంబంధించి నిందితులపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తూ తలపెట్టిన 'వినతి యాత్ర' పాదయాత్రను మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు తాత్కాలికంగా వాయిదా వేశారు. గుంటూరులోని తన నివాసంలో పార్టీ నేతలతో అత్యవసరంగా సమావేశమైన అనంతరం ఆయన ▶2లో

## విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే కఠిన శిక్ష: నారా లోకేశ్

- పరీక్షల అక్రమాల నిరోధక బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- ఈ సందర్భంగా విద్యార్థులకు నారా లోకేశ్ శుభాకాంక్షలు
- విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే వారికి గట్టి హెచ్చరిక అని వ్యాఖ్య
- నీట్ ఘటన తర్వాత కేంద్రం చేపట్టిన చర్యల ప్రస్తావన
- బిల్లును స్వాగతించిన పవన్ కల్యాణ్



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 30)**

ప్రభుత్వ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు, మాల్‌ప్రాక్టీస్‌కు అడ్డుకట్ట వేసే లక్ష్యంతో తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు--2026 లోక్‌సభలో ఆమోదం పొందడంపై ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ చట్టం విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే వారికి గట్టి హెచ్చరికగా నిలుస్తుందని చెప్పారు. పరీక్షల విశ్వసనీయతను కాపాడే దిశగా ఇది కీలక అడుగని అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన లోకేశ్.. ప్రశ్నపత్రాల లీకేజీలు, పరీక్షల మోసాలకు పాల్పడే వారిపై ఇక కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. చట్టపరమైన ▶2లో



# ఇప్పుడు గ్లోబల్ ఇన్వెస్టర్ల ఎంపిక ఆంధ్రప్రదేశ్

- గత ప్రభుత్వ చర్యలతో పెట్టుబడిదారుల విశ్వాసం కోల్పోయిందని వ్యాఖ్య
- త్వరలో ఆంధ్రప్రదేశ్ నుంచి విదేశాలకు క్లీన్ ఎనర్జీ ఎగుమతులు
- పరిశ్రమలు తేవడం మా బాధ్యత.. కష్టపడటం యువత బాధ్యత
- టాటా రెన్యువబుల్ ఎనర్జీ శంకుస్థాపన సభలో మంత్రి నారా లోకేష్



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 30)**

ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు గ్లోబల్ ఇన్వెస్టర్ల తొలి ప్రాధాన్యతగా మారిందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. బ్రూక్‌ఫీల్డ్, బ్లాక్‌స్టోన్, బ్లాక్‌రాక్, ఈక్వ్యాటీ, టీపీజీ వంటి ప్రతిష్టాత్మక గ్లోబల్ ప్రైవేట్ ఈక్విటీ ఫండ్‌లు ఏపీలో పెట్టుబడులు పెడుతున్నాయని, టాటా పవర్, సుజ్లాన్, రెన్యూ, ప్రీమియర్ ఎనర్జీస్, ఏసీఎంఈ, వారీ వంటి ప్రముఖ భారతీయ దిగ్గజ సంస్థల తమ కార్యకలాపాలను ఇక్కడ విస్తరిస్తున్నాయని ఆయన వెల్లడించారు. పత్తికొండ సమీపంలోని హోసూరు వద్ద టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ (టీపీఆర్ఈఎల్) ఆధ్వర్యంలో రూ.5,350 కోట్లతో అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఏర్పాటు చేయనున్న 800 మెగావాట్ల క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు గురువారం మంత్రి లోకేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, గత ఏడాదితో పోలిస్తే ఈ ఒక్క ఏడాదిలోనే ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 400 శాతం పెరిగిందని, రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న విశ్వసనీయత వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు.

### పెట్టుబడిదారుల్లో నమ్మకం పెంపొందించాం

"రాష్ట్రంలో 2024 జూన్ లో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు, పునరుత్పాదక ఇంధన రంగం పూర్తిగా అస్తవ్యస్తంగా ఉండేది. అంతకుముందు ఐదేళ్లలో కనీసం ఒక్క మెగావాట్ సామర్థ్యం గల ప్రధాన రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు కూడా ప్రారంభించలేదు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను ▶2లో

## విద్యార్థుల భవిష్యత్తు కంటే రాజకీయాలకే ప్రభుత్వం ప్రాధాన్యం: ఖర్గే

- రాజ్యసభకు పబ్లిక్ ఎగ్జామినేషన్స్ సవరణ బిల్లు
- కేంద్రంపై ప్రతిపక్ష నేత ఖర్గే విమర్శలు



**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 30)**

ప్రభుత్వ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు-2026పై రాజ్యసభలో తీవ్ర వాగ్వాదం జరిగింది. చర్చ సందర్భంగా ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కంటే రాజకీయాలకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందని ఆరోపించారు. ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసులు వ్యవహరించిన తీరుపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులపై లాఠీచార్జి జరిగిందని ఖర్గే ఆరోపించారు. ఢిల్లీ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలోనే పనిచేస్తాయని గుర్తు చేశారు. ఆ శాఖ అనుమతి ▶2లో

## భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని అడ్డుకునేందుకు కోర్టుల్లో కేసులు వేశారు: పల్లా శ్రీనివాస్

- ఉత్తరాంధ్రకు భోగాపురం విమానాశ్రయం మణిహారం లాంటిదన్న పల్లా
- ఎయిర్‌పోర్టును తానే నిర్మించినట్టు జగన్ భ్రమల్లో బతుకుతున్నారని వ్యాఖ్య
- ఈ ఎయిర్‌పోర్టు కోసం గత వైసీపీ ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలని డిమాండ్



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 30)**

ఉత్తరాంధ్ర అభివృద్ధికి అత్యంత కీలకమైన భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఆగస్టు 1న ప్రధాని మోదీ చేతుల మీదుగా వైభవంగా ప్రారంభం కానుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వెల్లడించారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఈ విమానాశ్రయం ఒక మణిహారం లాంటిదని, దీని రాకతో రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో భారీగా పెట్టుబడులు వస్తాయని పల్లా హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని అడ్డుకునేందుకు కోర్టులలో కేసులు వేసిన వారే... ఇప్పుడు క్రెడిట్ చోరీకి పాల్పడుతూ ఇది తమ ఘనత అని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. "గతంలో 'ఎర్ర బస్సు సరిగ్గా రాని చోట ఎయిర్‌పోర్ట్ ఎందుకు?' అని ప్రశ్నించిన జగన్, ఇప్పుడు తానే నిర్మించినట్లు భ్రమల్లో బతుకుతున్నారు" అని విమర్శించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌కు నిదర్శనమే ఈ విమానాశ్రయమని... కూటమి ప్రభుత్వం అధికారంలోకి ▶2లో

# ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ పకడ్బందీగా ఉండాలి

- జాబ్ కేలండర్-2026 రెండో దశ ఉద్యోగాల భర్తీకి కొత్త తేదీ ఖరారు
- సెప్టెంబర్ 15న 3,168 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల
- 3, 4 దశల్లోని 5,369 పోస్టులకు అక్టోబర్ 15న ప్రకటన



- ఉద్యోగాల భర్తీలో ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని అధికారులకు ఆదేశం
- మొత్తం 10,060 పోస్టుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయం

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 30)**

రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో ఎలాంటి న్యాయపరమైన, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా నోటిఫికేషన్లు విడుదల చేయాలని విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను స్పష్టంగా ఆదేశించారు. జాబ్ కేలండర్-2026 అమలుపై ▶2లో

## ప్రధాని మోదీ పేరిట ఆ లేఖ..నకిలీది : పీఐబీ ఫ్యాక్ట్‌చెక్



**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 30)**

దేశ రాజధాని దిల్లీలో విద్యార్థుల నిరసన జరిగినప్పటి నుంచి ప్రధాని మోదీ పేరిట పలు నకిలీ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. వీటిని ఇప్పటికే కేంద్రం ఖండించిన సంగతి తెలిసిందే. తాజాగా మోదీ సంతకం చేసిన లేఖ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. ప్రధాని రాజీనామా చేశారంటూ పలువురు దానిని షేర్ చేస్తున్నారు. ▶2లో

## రాజ్యసభ ముందుకు యాంటీ పేపర్ లీక్ బిల్లు



**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 30)**

ఇంటర్నెట్ డెస్క్: ప్రశ్నపత్రాల లీకేజీ నిరోధానికి ప్రభుత్వం తీసుకొచ్చిన 'పబ్లిక్ పరీక్షల (అనుచిత పద్ధతుల నివారణ) సవరణ బిల్లు 2026' రాజ్యసభ ముందుకు వచ్చింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ దీనిని సభలో ప్రవేశపెట్టారు. దీనిపై ఏడు గంటల పాటు చర్చించాలని నిర్ణయించారు.

### కాస్త ప్రశాంతంగా ఉండండి: కంగనా వ్యాఖ్యలపై సౌరవ్

ఈ సందర్భంగా జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. ప్రశ్నపత్రాల లీకులను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని, ఏమాత్రం సహించే ప్రసక్తే లేదన్నారు. పిల్లల భవిష్యత్తును ప్రమాదంలో పడేయడాన్ని అనుమతించబోమన్నారు. దేశంలోని విద్యార్థులు, యువత సంక్షేమాన్ని పరిరక్షించడంలో ▶2లో

## మొదటి పేజీ తరువాయి

## ఇరాన్‌కు చైనా క్షిపణులు.. వయా పాకిస్థాన్: స్పందించిన ట్రంప్

చైనా నుంచి దాదాపు 60 మిలియన్ డాలర్లకు పైగా విలువైన 400 షోల్డర్‌ఫైర్డ్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల కొనుగోలుకు ఒప్పందం జరిగింది. వీటితో తమ గగనతల రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాలని ఇరాన్ భావిస్తోంది. అయితే.. ఈ డీల్‌కు టెహ్రాన్ పక్షాన హాంకాంగ్ చెందిన ఝూంగ్‌కింగ్ బావోషాంగ్ ఇంటర్నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ మధ్యవర్తిగా ఉంది. ఈ క్షిపణులను ఉత్తర చైనా నుంచి పాకిస్థాన్ మీదుగా ఇరాన్‌లోకి చేర్చాలని ప్రణాళిక సిద్ధం చేశారు. కాకపోతే వీటిని భూమార్గంలో తరలిస్తారా..? గగనతలంలో తీసుకెళతారా అనే అంశంపై స్పష్టత లేదు. అయితే ఈ కథనాలను చైనా కొట్టిపారేయడం గమనార్హం.

**దద్దరిల్లుతున్న ఇరాన్.. భారీ దాడులు చేస్తోన్న అమెరికా**

ఈ క్రమంలోనే తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ అంశంపై స్పందించారు. చైనా ఆయుధాల సరఫరా విషయం తెలుసుకొని తాను నిరాశకు గురైనట్లు పేర్కొన్నారు. తాము ఇరాన్‌కు ఆయుధాలు విక్రయించబోమని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ స్వయంగా తనకు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. చైనా, రష్యాల నుంచి ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేయవద్దని గత వారం ట్రంప్ హెచ్చరికలు కూడా జారీ చేశారు.

## పాదయాత్రను వాయిదా వేస్తున్నా: అంబటి రాంబాబు

ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. త్వరలోనే పాదయాత్రకు సంబంధించి కొత్త తేదీని ప్రకటిస్తానని తెలిపారు.గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం... ఆగస్టు 7, 8 తేదీల్లో గుంటూరులోని తన నివాసం నుంచి మంగళగిరిలోని డీజీపీ కార్యాలయం వరకు రెండు రోజుల పాటు ఈ నిరసన పాదయాత్ర చేపట్టాల్సి ఉంది. అయితే, రాష్ట్రంలో డీఎస్సీ నిర్వహణలో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై వైసీపీ అదే సమయంలో రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. పార్టీ అధిష్ఠానం చేపడుతున్న ముఖ్యమైన నిరసన కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ, తన సొంత పాదయాత్రను వాయిదా వేస్తున్నట్లు అంబటి స్పష్టం చేశారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే కఠిన శిక్ష: నారా లోకేశ్

చర్యలతో పాటు పరీక్షల వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టిందని తెలిపారు. యువత భవిష్యత్తు రాజకీయాలకు అతీతమని, ప్రతిభ, పారదర్శకత, సమాన అవకాశాలే ఎప్పుడూ గెలవాలని ఆకాంక్షించారు.నీట్ ప్రశ్నపత్రం లీక్ ఘటన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం వేగంగా స్పందించిందని లోకేశ్ అన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు పరీక్షను తిరిగి సమయానికి నిర్వహించి, లక్షలాది మంది విద్యార్థుల విద్యా సంవత్సరం వృథా కాకుండా కాపాడిందని గుర్తుచేశారు. విద్యార్థుల భవిష్యత్తును రక్షించడంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించిందని పేర్కొన్నారు.

ఇదే అంశంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా స్పందించారు. ఈ బిల్లు లక్షలాది మంది విద్యార్థుల ఆశయాలను కాపాడే కీలక చట్టమని చెప్పారు. పరీక్షల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే నిర్ణయమిదని అభిప్రాయపడ్డారు. జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ)లో సమగ్ర సంస్కరణల కోసం నందన్ నీలేకని నేతృత్వంలో ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్‌ను కేంద్రం ఏర్పాటు చేయడం కూడా కీలక చర్యగా పేర్కొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తు కంటే రాజకీయాలకే ప్రభుత్వం ప్రాధాన్యం: ఖర్గే

లేకుండా ఇలాంటి చర్యలు జరిగే అవకాశం లేదని అన్నారు. ఈ ఘటనపై అమిత్ షా బాధ్యత నుంచి తప్పించుకోలేరని వ్యాఖ్యానించారు. విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలపై ఆయన సభలో ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టే బిల్లును ఇంత ఆలస్యంగా ఎందుకు తీసుకొచ్చారని ఖర్గే ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడే సంస్కరణలు చేయకుండా ప్రభుత్వం రాజకీయాల్లోనే నిమగ్నమైందని విమర్శించారు. ఢిల్లీలో విద్యార్థుల ఆందోళనలను చల్లార్చేందుకే ఈ బిల్లును తీసుకొచ్చారని ఆరోపించారు. బీజేపీ రాజకీయాల వల్లే దేశంలో ప్రశ్నపత్రాల లీకేజీలు, నిరసనలు, పోలీసు చర్యలు చోటుచేసుకున్నాయని అన్నారు.పేపర్ లీకేజీలు జరిగిన తర్వాత నష్టనివారణ చర్యలు తీసుకోవడం ఒక్కటే సరిపోదని ఖర్గే అభిప్రాయపడ్డారు. అలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా అమలు వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు ప్రభుత్వం అనుసరించబోయే స్పష్టమైన కార్యాచరణను వివరించలేదని విమర్శించారు. ఈ బిల్లు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతుందా అన్న సందేహాన్ని వ్యక్తం చేశారు.

గత రెండు నెలలుగా విద్యార్థులు, యువత దేశవ్యాప్తంగా పరీక్షల వ్యవస్థపై నిరసనలు వ్యక్తం చేశారని ఖర్గే గుర్తుచేశారు. వారి గొంతుకను ప్రతిపక్షం వీధుల నుంచి పార్లమెంట్ వరకు వినిపించిందన్నారు. ప్రజల ఒత్తిడి పెరగడంతో ప్రభుత్వం చివరకు వెనక్కి తగ్గిందని వ్యాఖ్యానించారు. విద్యార్థుల పోరాటం ఫలించిందని, వారి ఉద్యమం వల్లే ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని అన్నారు. అధికారాన్ని కోల్పోతామన్న భయంతోనే ప్రభుత్వం డిమాండ్లకు తలొగ్గిందని ఆరోపించారు.

## భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని అడ్డుకునేందుకు కోర్టుల్లో కేసులు వేశారు: పల్లా శ్రీనివాస్

వచ్చిన వెంటనే మిగిలిన పనులన్నింటినీ శరవేగంగా పూర్తి చేసి రికార్డు సమయంలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేసిందని తెలిపారు. టీడీపీ హయాంలోనే శంకుస్థాపన జరిగి, ఇప్పుడు తమ హయాంలోనే ప్రారంభమవుతోందని చెబుతూ... అసలు ఐదేళ్ల పాలనలో వైసీపీ ఈ ప్రాజెక్టు కోసం ఏం చేసిందో సమాధానం చెప్పాలని పల్లా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

## ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ పకడ్బందీగా ఉండాలి

ఆయన అధ్యక్షతన ఏర్పాటైన మంత్రుల బృందం బుధవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించింది. ఈ సమావేశానికి పలువురు మంత్రులు ఆన్‌లైన్ ద్వారా హాజరు కాగా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా కీలక అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులు, వాటి భర్తీకి అనుసరించాల్సిన విధివిధానాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రుల బృందానికి వివరించారు.

జాబ్ కేలండర్–2026లో భాగంగా ప్రకటించిన 10,060 ఉద్యోగాలను మొత్తం నాలుగు దశల్లో భర్తీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా తొలి దశలో వివిధ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 1,523 అధ్యాపక పోస్టుల భర్తీకి ఈ ఏడాది మే 15నే నోటిఫికేషన్ జారీ చేసిన విషయాన్ని అధికారులు గుర్తు చేశారు. రెండో దశ కింద 3,168 పోస్టులకు వాస్తవానికి ఆగష్టు 15న నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంది. అయితే, రాష్ట్రపతి ఉత్తర్వుల అమలులో ఎదురైన కొన్ని సాంకేతిక ఇబ్బందులు, ఉద్యోగ సంఘాల నుంచి వచ్చిన వినతుల నేపథ్యంలో ఈ ప్రక్రియలో స్వల్ప జాప్యం జరిగింది. ఈ కారణాలను పరిగణనలోకి తీసుకున్న మంత్రుల బృందం, రెండో దశ నోటిఫికేషన్‌ను సెప్టెంబర్ 15న విడుదల చేయాలని నిర్ణయించింది.3, 4 దశల నోటిఫికేషన్లు అక్టోబర్‌లో జాబ్ కేలండర్‌ను వేగంగా పూర్తి చేసేందుకు వీలుగా మూడు, నాలుగు దశల ఉద్యోగాల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఒకేసారి అక్టోబర్ 15న విడుదల చేయాలని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. మూడో దశలో 2,388 పోస్టులు, నాలుగో దశలో 2,981 పోస్టులు భర్తీ చేయనున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆయా శాఖల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఖాళీలను భర్తీ చేయాలని, ఆ దిశగా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. రెండో దశలో భర్తీ చేయనున్న 3,168 పోస్టుల్లో అత్యధికంగా 2,225 పోస్టులు హోంశాఖ పరిధిలోనే ఉన్నాయని అధికారులు తెలిపారు. గ్రూప్–1లో ప్రస్తుతం గుర్తించిన పోస్టుల సంఖ్యను మరింత పెంచాల్సిన అవసరం ఉందని మంత్రుల బృందం ఈ సందర్భంగా అభిప్రాయపడింది.మొత్తం 10,060 పోస్టుల భర్తీ ప్రక్రియలో ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా, సకాలంలో పూర్తి చేసి, ప్రతి ఏటా జాబ్ కేలండర్ విడుదల చేసే సంప్రదాయాన్ని కొనసాగించాలని లోకేశ్ దిశానిర్దేశం చేశారు. జాబ్ కేలండర్–2026కు సంబంధించిన పూర్తిస్థాయి ఖాళీల వివరాలను ఈ నెల 6న జరగనున్న కేబినెట్ సమావేశం ముందు ఉంచనున్నట్లు తెలిపారు. ఈ సమీక్షలో మంత్రులు వంగలపూడి అనిత, పి. నారాయణ, కొండపల్లి శ్రీనివాస్, కందుల దుర్గేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్, జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ రాజీవ్ కుమార్ మీనా, ఆర్థికశాఖ కార్యదర్శి వినయ్ చంద్, ఏపీపీఎస్సీ కార్యదర్శి రవి సుభాష్ పాల్గొన్నారు.

## రాజ్యసభ ముందుకు యాంటీ పేపర్ లీక్ బిల్లు

ప్రభుత్వ నిబద్ధతకు ఈ బిల్లు నిదర్శనమని చెప్పారు. ఈ బిల్లును తీసుకురావడానికి ప్రధాని ఏ మాత్రం ఆలస్యం చేయలేదని కేంద్ర మంత్రి వెల్లడించారు.

**ఆయన రాజీనామా చేసి మోదీ కుర్చీ కాపాడారు: ఖర్గే**

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి ప్రధాని మోదీ కుర్చీ కాపాడారని రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. యాంటీ పేపర్ లీక్ బిల్లుపై మాట్లాడుతూ.. “నీట్ పేపర్ లీక్ వల్ల చాలా మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. పేపర్ లీక్ కాకుండా ప్రభుత్వం ఏమాత్రం ముందస్తు చర్యలు చేపట్టలేదు. 2024లోనే ఈ బిల్లును ఎందుకు తీసుకురాలేదు? దిల్లీలో విద్యార్థుల విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై అమిత్‌షా ఎందుకు మౌనంగా ఉన్నారు? ఈ ఘటనకు ఆయన బాధ్యత వహించాల్సిందే” అని అన్నారు.

## ప్రధాని మోదీ పేరిట ఆ లేఖ..నకిలీది పీఐబీ ఫ్యాక్ట్‌చెక్

దీనిపై కేంద్రం ఆధ్వర్యంలోని పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ స్పష్టత ఇచ్చింది.“ప్రధాని మోదీ సంతకం చేసినట్టుగా ఉన్న లేఖ ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అదొక నకిలీ లేఖ. ప్రధాని సంతకం చేసిన అలాంటి లెటర్ ఏదీ జారీ కాలేదు. ఏదైనా ప్రచారాన్ని నమ్మడానికి ముందు.. అధికారికంగా ధ్రువీకరించుకోండి. ఏదైనా సమాచారం అనుమానాస్పదంగా అనిపించినప్పుడు సమాచారం ఇవ్వండి” అని పీఐబీ ప్రజలను అప్రమత్తం చేసింది. ఇలాంటి తప్పుడు సమాచారంపై సంప్రదించేందుకు (91 8799711259, ఫోన్ నంబర్, మెయిల్ ఐడీని షేర్ చేసింది.

## ఇప్పుడు గ్లోబల్ ఇన్వెస్టర్ల ఎంపిక ఆంధ్రప్రదేశ్

ఏకపక్షంగా రద్దు చేశారు. పెట్టుబడిదారుల్లో విశ్వాసం దెబ్బతింది. ప్రపంచంలోని అనేక అతిపెద్ద ఇన్‌ఫ్రా, క్లైమెట్ ఫండ్స్ ఆంధ్రప్రదేశ్‌ను బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాయి. ఒకసారి దెబ్బతిన్న విశ్వాసాన్ని పునరుద్ధరించడం రాత్రికి రాత్రే సాధ్యంకాదు. పెట్టుబడిదారుల్లో మళ్లీ నమ్మకాన్ని పెంపొందిస్తూ వచ్చాం” అని పేర్కొన్నారు.

**ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీతో తొలిఅడుగు:** ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ – 2024ను ప్రవేశపెట్టి విస్తృతమైన విజన్‌తో 160 గిగావాట్ల క్లీన్ ఎనర్జీ సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని అన్నారు. సోలార్ మాడ్యూల్స్, సెల్స్ నుండి బ్యాటరీలు, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, ట్రాన్స్ మిషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, పోర్ట్స్, స్టోరేజీ సిస్టమ్స్.. ప్రపంచ స్థాయి తయారీ వరకు – మొత్తం క్లీన్ ఎనర్జీ సప్లయ్ చైన్ ను ఆంధ్రప్రదేశ్ లో నిర్మించాలని అనుకున్నామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛ ఇంధనాన్ని వినియోగించుకోవడమే కాకుండా, క్లీన్ ఎనర్జీ టెక్నాలజీలకు గ్లోబల్ ప్రొడ్యూసర్ గా మారాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని లోకేష్ తెలిపారు.

**టాటా రెన్యువబుల్ ప్రాజెక్ట్.. మా విజన్ కు నిదర్శనం :** “టాటా రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ రూ. 5,750 కోట్ల పెట్టుబడితో, పత్తికొండలో 400 మెగావాట్ల సౌర విద్యుత్‌ను, అనంతపురం జిల్లా కనేకల్లులో 400 మెగావాట్ల పవన విద్యుత్‌తో కలిపి, 800 మెగావాట్ల హైబ్రిడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టుగా అవతరించబోతోంది. ఈ ఒక్క ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో దాదాపు 4,000 ఉద్యోగాలను కల్పిస్తుంది. 3,400 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో గల ఈ ప్రాజెక్టు ద్వారా 1,100 పైగా రైతు కుటుంబాలకు దాదాపు మూడు దశాబ్దాల పాటు స్థిరమైన కౌలు ఆదాయాన్ని అందిస్తుంది. ఈ ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్‌పైనా, మా పరిపాలనపైనా విశ్వాసానికి ప్రతీక.

**టాటా గ్రూప్ తో మాకు ప్రత్యేకమైన అనుబంధం:** టాటా గ్రూప్‌తో మాకు దశాబ్దాల తరబడి అనుబంధం ఉంది. 1990లో నా తండ్రి చంద్రబాబు నాయుడు గారు హైదరాబాద్‌లో ‘హైటెక్ సిటీ’ని నిర్మిస్తున్నప్పుడు, ఆయన దార్శనికతను నమ్మిన మొట్టమొదటి సంస్థలలో టిసిఎస్ ఒకటి. ఆ నమ్మకంతో కూడిన అనుబంధం నేటికీ కొనసాగుతోంది. 2024లో మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, నేను టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్‌ను కలిసి ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించడానికి ఆంధ్రప్రదేశ్ భిన్నంగా ఏమి చేయాలి అని అడిగాను. “వేగంపై దృష్టి పెట్టండి. పెట్టుబడిదారులకు ప్రోత్సాహకాల కంటే జాప్యం వల్ల కలిగే నష్టమే ఎక్కువ,” అని ఆయన చెప్పారు. మా ప్రభుత్వ విధానం కూడా సింపుల్, స్పీడ్, స్టేబిలిటీలో భాగం అయ్యింది. శంకుస్థాపన నుండి ప్రారంభోత్సవం వరకు ప్రభుత్వం మద్దతుగా నిలబడుతుందనే విశ్వాసం మేము పెట్టుబడిదారులకు కల్పిస్తున్నాం” అని అన్నారు.

**స్వచ్ఛ ఇంధనం ఎగుమతి చేస్తాం :** “భారతదేశంలోనే అత్యంత పొడవైన తీరప్రాంతం, సమృద్ధిగా పునరుత్పాదక వనరులు, ప్రపంచ స్థాయి ఓడరేవులు ఉన్న ఆంధ్రప్రదేశ్ గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఎగుమతులకు భారతదేశపు ముఖద్వారంగా మారడానికి మాకు అవకాశం కల్పిస్తున్నాయి. అతి త్వరలో ఆంధ్రప్రదేశ్‌లో ఉత్పత్తి అయ్యే స్వచ్ఛమైన ఇంధనాన్ని తీసుకువెళ్లే ఓడలు యూరప్, జపాన్, కొరియా, ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు ప్రయాణిస్తాయి. క్లీన్ మాలిక్యులస్, గ్రీన్ ఫ్యూయల్స్, సాంకేతికతలను ఎగుమతులూ ఏపీ నుంచి చేసే స్థాయికి చేరతాం.

**సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కలిసి పనిచేయాలి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఐఐటి తిరుపతి, యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ (ఆస్ట్రేలియా) సహకారంతో సోలార్ మ్యానుఫ్యాక్చరింగ్, రెన్యువబుల్ ఎనర్జీ టెక్నాలజీల కోసం ఏర్పాటు చేస్తున్న ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కలిసి పనిచేయాలని టాటా పవర్‌ను ఆహ్వానిస్తున్నాం. మనం కలిస్తే భారతదేశపు స్వచ్ఛ ఇంధన భవిష్యత్తును నిర్మించే ఇంజనీర్లు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులు, పారిశ్రామికవేత్తలను తయారు చేయగలం. టాటా రెన్యువబుల్ ఎనర్జీ కార్యరూపం దాల్చడానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికీ అభినందనలు తెలియజేస్తున్నాను.

**సుజ్లాన్ కు ప్రత్యేక అభినందనలు :** దశాబ్దాలుగా, భారతదేశ పవన శక్తి రంగంలో సుజ్లాన్ అగ్రగామి పాత్ర పోషిస్తున్న సుజ్లాన్ పవన శక్తి ప్రాజెక్ట్ అభివృద్ధిలో భాగం కావడం ఆంధ్రప్రదేశ్ పునరుత్పాదక ఇంధన లక్ష్యాలకు గొప్ప బలాన్ని చేకూరుస్తుంది. ఈ ప్రాజెక్ట్ కోసం అవసరమైన విండ్ టర్బైన్‌లను అనంతపురంలోనే సుజ్లాన్ ఏర్పాటు చేసిన కేంద్రంలో తయారు కావడం ఏపీలో సమగ్ర పారిశ్రామిక వ్యవస్థ అభివృద్ధికి మరో నిదర్శనం. విండ్ టర్బైన్‌ల తయారీ, నిర్వహణలో యువతకు నైపుణ్య శిక్షణనిచ్చే కేంద్రాలను కూడా ఏర్పాటుచేసి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానంలో దీర్ఘకాలిక భాగస్వామిగా నిలిచినందుకు సుజ్లాన్ యాజమాన్యం, బృందానికి కృతజ్ఞతలు.

**వజ్రాల నేల..బంగారంలాంటి ప్రజలు:** అశోకుడు పాలించిన గొప్ప నేల పత్తికొండ. పత్తికొండలో యువశక్తి అదిరిపోయింది. బంగారు గనులు ఉన్న ప్రాంతం ఇది, బంగారం లాంటి ప్రజలు ఉన్న నేల ఇది. జొన్నగిరి గోల్డ్ ఇప్పుడు ఏపీకే బ్రాండ్. పత్తికొండ బంగారం గురించి ఇప్పుడు ప్రపంచం మొత్తం మాట్లాడుతుంది. ఈ నేలలో వజ్రాలు దొరుకుతాయి, వజ్రాల లాంటి యువకులు ఇక్కడ ఉన్నారు. పెరవలి రంగనాథ స్వామి ఆలయం, పత్తికొండ సాయిబాబా ఆలయం ఉన్న పుణ్య భూమి పత్తికొండ” అని మంత్రి పేర్కొన్నారు.

**కర్నూలు ప్రజల అభిమానం మరువలేను:** “ఉమ్మడి కర్నూలు జిల్లా అంటే నాకు ఇష్టం. నేను పాదయాత్రలో వచ్చినప్పుడు ప్రజలు చూపిన ప్రేమ ఎప్పటికి మర్చిపోలేను. నేను 45 రోజులు, 14 నియోజక వర్గాల్లో పాదయాత్ర చేసాను. నాకు కర్నూలు జిల్లా ప్రజల సమస్యలు తెలుసు, కష్టాలు, వలసలు నేను చూశాను. నేను పత్తికొండ వచ్చినప్పుడు అప్పటి ప్రభుత్వం నన్ను అడ్డుకోవడానికి 1000 మంది పోలీసులను పంపింది. పత్తికొండ ప్రజలు నాకు మద్దతుగా నిలిచారు. అందుకే మీ రుణం తీర్చుకుంటున్నా. ఉమ్మడి కర్నూలు జిల్లా అభివృద్ధిని బాధ్యతగా తీసుకున్నా. గౌరవ ముఖ్యమంత్రి గారు, నేను, మంత్రి టిజి భరత్ ప్రపంచం మొత్తం తిరిగి రాష్ట్రానికి అనేక కంపెనీలు తీసుకొస్తున్నాం. కర్నూలు జిల్లాకు కూడా అనేక పరిశ్రమలు రాబో తున్నాయి. పరిశ్రమలు తీసుకురావం మా బాధ్యత. కానీ కష్టపడి పనిచేయాల్సిన బాధ్యత యువకులపై ఉంది. కష్టం, ప్రతిభ రెండూ ఉండాలి. అప్పుడే కంపెనీలకు నమ్మకం వస్తుంది” అని అన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోండి


### జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆదేశం




**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జులై 30)**

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అధికారులను ఆదేశించారు. గురువారం మార్కాపురం కలెక్టరేట్ లో రవాణా, పోలీసు, ఆర్టీసీ, నేషనల్ హైవే, ఆర్‌అండ్‌బి, వైద్య ఆరోగ్య, మున్సిపల్ శాఖ అధికారులతో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి మరోసారి అక్కడ ఎలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్ల వెంట వాహనాలు నిలుపుదల చేయకుండా చూడాలన్నారు. అదే విధంగా కంభం, గిద్దలూరు, కుంట, బేస్తవారిపేట తదితర ప్రాంతాల్లో రోడ్లపై ఉన్న ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. దీంతో పాటు ఆర్టీసీ బస్సుల్లో బ్రేక్ డౌన్ కాకుండా సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు. సంబంధిత అన్ని శాఖల సమన్వయంతో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు కృషి చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖ అధికారి రాంబాబు, డీఎస్పీ నాగరాజు, ఆర్టీసీ డిఎం లావణ్య, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## డాక్టరేట్ పట్టాపుచ్చుకున్న చంద్రశేఖరరెడ్డికి అభినందనలు



**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జులై 30)**

“త్రిపురాంతక క్షేత్ర సాహిత్యము సమగ్రంగ పరిశీలన” అనే అంశం పై పరిశోధన చేసి సమర్పించిన పిహెచ్‌డి, సిద్ధాంతవ్యాసానికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను తర్లుపాడు మండలంలోని చెన్నారెడ్డి పల్లె జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్, తెలుగుపండితులుగా పనిచేస్తున్న వరికూటి చంద్రశేఖరరెడ్డికి ప్రధానం చేస్తున్నట్లు విశ్వవిద్యాలయ తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య ఎన్వి కృష్ణారావు ప్రకటించడం జరిగింది. చంద్రశేఖర్రెడ్డి జిల్లా కేంద్రమైన మార్కాపురంలోని శ్రీ సాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కుప్పగంతుల మధుసూదన్ వారి పర్యవేక్షణలో పిహెచ్‌డి పరిశోధన చేశారు. ప్రసిద్ధ శైవ క్షేత్రమైన త్రిపురాంతకం, ఈ క్షేత్రానికి దరిదాపులో వెలసిన తెలుగు సాహిత్యం, సామాజిక ప్రయోజనాలను విశ్లేషణాత్మకంగా వివరించి లోతైన పరిశోధనకు విశ్వ విద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయ తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య చిన్నరెడ్డప్ప విషయ నిపుణులుగా హాజరై పీహెచ్‌డి తుది పరీక్షకు నిర్ణేతగా వ్యవహరించి చంద్రశేఖర రెడ్డి పరిశోధన ప్రామాణికమని ప్రకటించడం జరిగింది. దీంతో చంద్రశేఖర్‌రెడ్డిని మార్కాపురం జిల్లా విద్యాశాఖ అధికారి సామ సుబ్బారావు, ఉప విద్యాశాఖ అధికారి ప్రగడ శ్రీనివాసరావు, జిల్లా డిసిఇబి సెక్రటరీ ముత్తోజు సుధాకర్, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంబాలరాజు, మార్కాపురం బాలురఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర పండిత పరిషత్ ప్రధానకార్యదర్శి రవిచంద్ర, జిల్లా అధ్యక్షులు జివిఎల్ రమేష్, టిపి వెంకటేశ్వర్లు, డాక్టర్ అంజిరెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ టి రాఘవేంద్రరావు, సాహితీ సంస్థల ప్రముఖులు డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి, ముత్తారెడ్డి వెంగళరెడ్డి, మంత్రి కృష్ణమోహన్, అనగా సుబ్బారావు, త్రిపురాంతక దేవాలయ అధ్యక్షులు ధూపాటి విశ్వనారాయణశర్మ, పాలంక ప్రసాద్ శర్మ, దేవాలయ ట్రస్టు బోర్డు అధ్యక్షులు మోటకట్ల శ్రీనివాసరెడ్డి, నిర్వహణ అధికారి అనిల్ కుమార్, మిత్రబృందం ఆయనను హృదయపూర్వకంగా అభినందించారు.

## ఏపీ ఆర్యవైశ్య మహాసభ నూతన కమిటీ కార్యవర్గ సభ్యులుగా పోలేపల్లి జనార్ధనరావు

**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జులై 30)**



ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ నూతన కమిటీ కార్యవర్గ సభ్యులుగా మార్కాపురం జిల్లా, తర్లుపాడు మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు, మండల కేంద్రమైన తర్లుపాడు గ్రామవాసి అయిన పోలేపల్లి జనార్ధనరావు ఆర్యవైశ్యుల అభ్యున్నతికి చేసిన సమాజ సేవలను రాష్ట్ర మహాసభ గుర్తించి ఆయనను నూతన కమిటీ కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో గ్రామంలోని ఆర్య వైశ్యులు, బంధుమి త్రులు, ఆయన శ్రేయోభిలాషులు హర్షాభినందనాలు తెలియజేశారు.



ప్రకాశం



మార్కాపురం



బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు | తెలుగు దినపత్రిక

31.07.26 శుక్రవారం



### ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి
# శక్తివంచన లేకుండా కృషి చేస్తా

**ఏపి ఆర్యవైశ్య మహాసభ మీడియా కమిటీ వైస్ చైర్మన్ ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్**



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 30)**

ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ మీడియా కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా షణ్ముఖ వెలుగు దినపత్రిక ఎడిటర్ రాధాకృష్ణ దాస్ (షణ్ముఖ) నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన మహాసభ నాయకత్వానికి ప్రత్యేక హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కీలక పదవి లభించడానికి ఎంతగానో సహకరించిన టిజి వెంకటేష్ (ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షులు), ఇల్లూరు లక్ష్మయ్య (రాష్ట్ర అధ్యక్షులు), మాటూరి రంగనాథ్ (రాష్ట్ర ప్రధాన కార్యదర్శి), రాష్ట్ర కమిటీ పెద్దలకు ఆయన పేరుపేరునా ప్రత్యేక పత్రికా మూలం కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడ, ఏ ప్రాంతంలో ఆర్యవైశ్యులకు సమస్య ఎదురైనా మీడియా ద్వారా ఎప్పటికప్పుడు వారి గొంతుకగా నిలుస్తాను. సమస్యలను ఉన్నతాధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి నా శక్తివంచన లేకుండా నిరంతరం కృషి చేస్తానని హామీ ఇస్తున్నాను. తన పై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ఆర్యవైశ్య సమాజ సంక్షేమానికి, మీడియా కమిటీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.



ANDHRA PRADESH ARYA VYSYA MAHASABHA

Vysya Bhavan, D.No. 6-2-648, Chintalbasti, Khairatabad, Hyderabad - 500 004. (Regd.No. 325/1968)
Phones : Office : 040-23397038, Guest House : 040-23317691, email: apavms@gmail.com
Regional Offices : VIJAYAWADA, KARNOOL

PRESIDENT : ELLURU LAKSHMAIAH
Flat No. 401, Goyel Appartment, Lecturers Colony, Beside Bishop Church,
KURNOOL - 518002. Cell: 94402 94419, 70955 44444

GENERAL SECRETARY : MATURI RANGANATH
#41, Kinnera Complex, IMA Hall Road,
GUDIVADA - 521 301. Cell: 98859 29999

TREASURER : SIDDA SURYA PRAKASA RAO
#7-6-12, Lawyerpet,
ONGOLE - 523 002. Cell: 92464 61111

నియామకపు పత్రము

శ్రీ OBULASETTY KRISHNADAS - PODALI Mob: 9494177939

అనితర సాధ్యమైన ఐకమత్యానికి ప్రతీకగా... అద్వితీయ ఘనచరితకు వేదికగా... అలరారుతున్న ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గము 2026-2028 రెండు సంవత్సరముల పదవీ కాలమునకు మిమ్ములను Media Committee Vice Chairman AP Arya Vysha Maha Sabha గా నియామకము చేయుచున్నాము.

ఈ రెండు సంవత్సరముల కాల పరిమితిలో మహాసభ అభివృద్ధికి, విజయవాడలో స్వంత భవన నిర్మాణానికి, మన సంఘీయుల అభ్యున్నతికి నేను చేపట్టే అన్ని కార్యక్రమాలకు మీ సంపూర్ణ సహాయ సహకారములు అందించి ఆర్యవైశ్య జాతి ఆర్థిక, సామాజిక, రాజకీయ వైభవం పెంపొందించుటకు కృషి చేస్తారని ఆశిస్తూ, మిమ్ములను నియామకము చేయుచున్నాము.

ఇట్లు
(ఇల్లూరు లక్ష్మయ్య)
అధ్యక్షులు : ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ



### రావినూతలలో
# అప్పుడో లెక్క.. ఇప్పుడో లెక్క!

**(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, జులై 30)**

రావినూతల గ్రామంలో ఒకప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలలో పారిశుధ్యం లోపించడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. సక్రమంగా కాలనీలలో నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆరోపించిన సంఘటనలు ఉన్నాయి. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో అందుకు పూర్తిగా భిన్నంగా మారింది. పంచాయతీ సెక్రటరీగా దుర్గా బాధ్యతలు చేపట్టిన తర్వాత పంచాయతీ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. కాలనీలలో మెరుగైన పారిశుద్ధ్యం తో పాటు మంచినీరు సక్రమంగా వస్తుందని పలువురు మహిళలు షణ్ముఖ వెలుగు దినపత్రిక వద్ద హర్షం వ్యక్తం చేశారు. కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించారు అంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ సెక్రటరీ దుర్గా మాట్లాడుతూ ఎండిఓ రాజ్యలక్ష్మి సహకారంతో శానిటేషన్ పై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు చెప్పారు. డంపింగ్ యార్డ్ అభివృద్ధి పై ప్రణాళిక రూపొందించినట్లు ఆమె పేర్కొన్నారు. గ్రామస్తుల ప్రోత్సాహంతో గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానని తెలియజేశారు.

# తల్లికి వందనం.. తండ్రికి జమ పై మౌనమేల

**(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, జులై 30)**

మండలంలోని గ్రామాలలో తల్లికి వందనం నగదు తండ్రుల అకౌంట్ లలో జమ అవటంపై ఇబ్బందులు పడుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ విషయం విద్యాశాఖ అధికారులు దృష్టికి వెళ్లినా వారు పొరపాటు ఎక్కడు జరిగిందో దర్యాప్తు చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఈ విషయంపై స్పందించవలసిన జిల్లా విద్యాశాఖ అధికారులు కూడా మౌనం వహిస్తున్నారంటూ తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ఇన్ యాక్టివ్ అకౌంట్ నెంబర్ లలో డబ్బులు జమ కావటంతో ఇబ్బందులు పడుతుంటే మరొకవైపు డబ్బులు కట్టాలంటూ పాఠశాలల యాజమాన్యాలు ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పొరపాటు ఎక్కడ జరిగిందో గుర్తించి వారిపై చర్యలు తీసుకోవలసిన జిల్లా విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వారు వాపోతున్నారు. అధికారులే పట్టించుకోకపోతే తమ పరిస్థితి ఏమిటి అని ఏకరువు పెడుతున్నారు. మొత్తం మీద తల్లికి వందనం డబ్బులు తలనొప్పిగా మారాయని ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవాలని మండలంలోని తల్లిదండ్రులు కోరుతున్నారు.


# దారి తప్పిన జింకకు సురక్షిత రక్షణ

### చెట్లలో చిక్కుకున్న జింకను కాపాడిన స్నేక్ క్యాచర్

**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జులై 30)**

అడవి నుంచి దారి తప్పి జనావాసంలోకి వచ్చిన ఓ జింక తర్లుపాడు గ్రామంలోని కోట వీధిలో చెట్ల మధ్య చిక్కుకుని స్థానికులను ఆందోళనకు గురిచేసింది. గురువారం ఉదయం జింక కనిపించడంతో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని తిలకించారు. చెట్ల మధ్య ఇరుక్కుపోయిన జింక భయంతో బయటకు రావడానికి ప్రయత్నించినా సాధ్యపడలేదు. సమాచారం అందుకున్న ఫారెస్ట్ స్నేక్ క్యాచర్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని ఎంతో చాకచక్యంగా జింకను సురక్షితంగా బయటకు తీశారు. ఈ సందర్భంగా జింకకు ఎలాంటి గాయాలు కాకుండా జాగ్రత్తలు తీసుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం జింకను అటవీ శాఖ అధికారుల సమన్వయంతో తిరిగి సమీప అటవీ ప్రాంతంలో సురక్షితంగా విడిచిపెడతామని స్నేక్ క్యాచర్ తెలిపారు. అడవి జంతువు గ్రామంలోకి రావడంతో కొంతసేపు కోట వీధిలో ఆసక్తికర వాతావరణం నెలకొంది. జింకను సురక్షితంగా రక్షించిన స్నేక్ క్యాచర్‌ను స్థానికులు అభినందించారు.





# వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ జనరల్ సెక్రెటరీగా తాతా సత్యనారాయణ

### పొదిలి నేతకు రాష్ట్రస్థాయి పదవి
### నియామక ఉత్తర్వులు జారీ చేసిన వైఎస్సార్‌సీపీ అధిష్టానం
### హర్షం వ్యక్తం చేసిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, వాణిజ్య ప్రముఖులు



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 30)**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగ జనరల్ సెక్రెటరీగా పొదిలి పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, పార్టీ నాయకుడు తాతా సత్యనారాయణ (తాతా సత్యం) నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ ఆవిర్భావం నుండి తాతా సత్యనారాయణ పార్టీ బలోపేతానికి, వాణిజ్య విభాగంలో చురుగ్గా సేవలందిస్తూ వస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన అధిష్టానం ఈ బాధ్యతలను అప్పగించింది. తాతా సత్యనారాయణకు రాష్ట్రస్థాయి పదవి వరించడంతో పొదిలి పట్టణంతో పాటు జిల్లాలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వాణిజ్య వర్గాలు తీవ్ర ఆనందం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా ఆయనకు పలువురు నాయకులు, అభిమానులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పై ఎంతో నమ్మకంతో రాష్ట్ర వాణిజ్య విభాగ జనరల్ సెక్రెటరీగా బాధ్యతలు అప్పగించిన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, మార్కాపురం నియోజకవర్గ వైకాపా ఇన్చార్జి అన్నా వెంకట రాంబాబుకు, జిల్లా ముఖ్య నాయకులకు తాతా సత్యనారాయణ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వాణిజ్య వర్గాల సమస్యల పరిష్కారానికి, పార్టీ వాణిజ్య విభాగాన్ని రాష్ట్రవ్యాప్తంగా బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

తాతా సత్యంకు అభినందనలు : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీగా నియమితులైన తాతా సత్యనారాయణను గురువారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగ మంచిగంటి సుధీర్, రవ్వ శ్రీను, నారాయణలు ఆయనకు శాలువా కప్పి పూల బొకే అందజేసి శుభాకాంయలు తెలిపారు.

## డేటా ఎంట్రీ పై శిక్షణ కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జులై 30)
బాపట్ల జిల్లా ఇంకోల్లు స్థానిక వెలుగు కార్యాలయం నందు గురువారం ఎపిఎం అనురాధ అధ్వర్యంలో గ్రామ సంఘం సహాయకులకు గ్రామ సంఘాలకు సంబంధించిన డేటా ఎంట్రీ పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాపట్ల జిల్లా వెలుగు డిఆర్డిఏ కార్యాలయం సంస్థాగత నిర్మాణం డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ కాకి రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఇ సందర్భంగా కాకి రవికుమార్ మాట్లాడుతూ లోకోస్ అంటే ప్రజల చేత ఆపరేటింగ్ చేసే సిస్టమని ఈ యాప్ ద్వారాఇప్పటి వరకు గ్రామ సంఘంలో ఉన్న ప్రారంభ ఆర్థిక వివరాలు అలాగే సాధారణ లావాదేవీలను మార్చి 31 2026 నాటికి ఎంటర్ చేయాలని వివరించారు. డేటా ఎంట్రీ లో సాధారణంగా నమోదు చేయవలసిన అంశాలు ప్రారంభ నగదు నిల్వ, బ్యాంకు ఖాతా నిల్వ, బాకీ ఉన్న రుణాల వివరాలు ,పొదుపు నిధులు మరియు ఇతర వివరాలన్నిటిని కూడా ఎంటర్ చేయాలని ఆ తర్వాత నుంచి నెల నెల గ్రామ సంఘంలో జరిగే ఆర్థిక లావాదేవీలను ఎంటర్ చేయాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక ఏపిఎం అనురాధ, సిసిలు అశోక్ కుమార్, రాజశేఖర్, గ్రామ సంఘం సహాయకులు, మండల సమాఖ్య అకౌంటెంట్ హాజరయ్యారు.

## కొత్తపట్నం హై స్కూల్‌కు ప్రత్యేక నోటు పుస్తకాల బహూకరణ పంపిణీ చేసిన చాపల వంశీకృష్ణ, చాపల శాంతకుమారి







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 30)
కొత్తపట్నం బిఎస్ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక నోటు పుస్తకాల బహూకరణ కార్యక్రమంలో శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ చాపల వంశీకృష్ణ, హైరిస్క్ ప్రెగ్నెన్సీ స్పెషలిస్ట్, సంతాన సాఫల్య నిపుణులు, ల్యాపరోస్కోపీ సర్జన్ డాక్టర్ చాపల శాంతకుమారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ చాపల వంశీ కృష్ణ మాట్లాడుతూ పిల్లల విద్యతో పాటు వారి ఆరోగ్యం కూడా సమానంగా ముఖ్యమని, తల్లిదండ్రులు పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆరోగ్యవంతమైన పిల్లలే రేపటి సమాజానికి బలమైన పునాది అని పేర్కొన్నారు.భవిష్యత్తులో కూడా విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు శ్రీరామ్ హాస్పిటల్ తన సేవలను కొనసాగిస్తుందని తెలియచేసారు. అనంతరం 900 మంది విద్యార్థులందరికీ ఈ విద్యాసంవత్సరానికి సరిపడ అన్ని రకాల ప్రత్యేకంగా ముద్రించిన నోట్ పుస్తకాలను, ఫ్రీ హెల్త్ స్క్రీనింగ్ కార్డును విద్యార్థులకు అందజేశారు. అలాగే ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి పద్మావతి మాట్లాడుతూ కొత్తపట్నం మండలంలో విద్యాభివృద్ధికి వంశీ కృష్ణ, శాంత కుమారి దంపతులు చేస్తున్న సేవలు అభినందనీయమని, వీటిని అందరూ స్ఫూర్తి వంతంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం కొత్తపట్నం మండలంలో ఎంపిక చేసిన కొన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బహూకరించడం కోసం 500 ప్రత్యేక నోటు పుస్తకాలని మండల విద్యాశాఖాధికారి పద్మావతికి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కొప్పోలు సౌమిత్ర పల్లవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఎదిగిన కొద్ది ఒదిగిన నైజం జాతీయ స్థాయిలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు

### ఆధ్యాత్మిక సాంస్కృతిక రంగాలలో కృషి చేస్తున్న బుచ్చేశ్వర్‌రావు









(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 30)
సామాజిక సేవ ఆధ్యాత్మిక సాంస్కృతిక రంగాలలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు పొంది స్ఫూర్తిగా నిలిచారు ఎల్‌సిఎస్ కళ్యాణ నిలయం జాతీయ సెక్రెటరీ బుచ్చేశ్వర్‌రావు. సామాజికపరంగా విద్య వైద్యం ఇతరతా రంగాల్లో కృషి చేస్తున్న ఎందరినో గుర్తించి వారికి పురస్కారాలు ఇవ్వటమే కాకుండా ముగ్గురు ముఖ్యమంత్రి చేత సమస్యలు పొంది తనకంటూ ఒక విభిన్నమైన శైలిని ఏర్పరచుకున్నారు. మన సంస్కృతి సాంప్రదాయాలైన కూచిపూడి, భరతనాట్యం లాంటి కళలను పోషిస్తూ ఎంతోమంది కళాకారులకు పురస్కారాలు అందజేసిన ఘనత వారికే దక్కింది. మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అలాగే మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసలు పొందారు. గత 18 సంవత్సరాలుగా ఎన్నో కార్యక్రమాలు, విద్యార్థులను ప్రోత్సహించడం, అలాగే విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉండే సృజనాత్మకతను వెలుగులోకి తీసుకువచ్చి వారికి పురస్కారాలు ఇవ్వటం లాంటి కార్యక్రమాలు ఎన్నో నిర్వహించారు. ఇప్పటివరకు సుమారు రెండు వేలకు పైగా కార్యక్రమాలు నిర్వహించి సుమారు 5,000 మందికి ఎన్నో రంగాలలో కృషి చేస్తున్న చిన్నారులను కళాకారులను గుర్తించి అలాగే సామాజిపరంగా సేవ చేస్తున్న వారిని గుర్తించి వారికి అవార్డులు అందజేయడం జరిగింది. బుచ్చేశ్వర్‌రావు నిర్విరామంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ తనకంటూ ఒక విభిన్న శైలిని ఏర్పరచుకున్నారు. ఎదిగిన కొద్ది ఒదిగి ఉంటూ సామాజికపరంగా ఆధ్యాత్మిక కాలంపరంగా ఎదిగిన విధానం అభినందనీయం. ఇందులో న్యాయమూర్తులు, అధికారులు వీరు నిర్వహించిన కార్యక్రమాలకు హాజరై అభినందనలు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఎంతోమంది కళాకారులను అలాగే సామాజిక పరంగా సేవ చేస్తున్న వారిని గుర్తించి వారిని ఒక వేదికపైకి తీసుకువచ్చి వారికి పురస్కారాలు అందజేసిన ఘనత వీరికే దక్కింది. బాల్యం నుండి చిన్నారుల్లో అంతర్లీనంగా ఉండే సృజనాత్మకతను వెలుగులోకి తీసుకువస్తే భవిష్యత్తులో వారు ఒక ఉన్నత స్థాయికి రాగలరని ఉద్దేశంతో వారిని ప్రోత్సహిస్తూ ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారు. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ తమిళనాడు ఢిల్లీ లాంటి రాష్ట్రాల్లో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో కేంద్ర మంత్రులు రాష్ట్ర మంత్రులు చేతులమీదుగా పురస్కారాలు అందుకున్నారు అంతేకాకుండా గత 19 సంవత్సరాలుగా చేసిన కార్యక్రమాలకు గుర్తుగాహోప్ ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్ అలాగే ప్రెస్టేజ్జీయస్ వరల్డ్ రికార్డ్ అలాగే తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్. అలాగే జీనియస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ అందుకున్నారు. ఎన్నో అంతర్జాతీయ పురస్కారాలు ఎన్నో జాతీయ పురస్కారాలు వీరిని వరించాయి. సామాజిక, ఆర్థికంగా కృషి చేస్తున్న వారిని ప్రోత్సహించటం వారిని అంతర్లీనంగా వారికంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తీసుకురావడంలో బుచ్చేశ్వర్‌రావు చేస్తున్న కృషి ప్రశంసనీయమని చెప్పవచ్చు. ఎంతోమంది కళాకారులకు చేయూతనిచ్చారు. లండన్ బుక్ ఆఫ్ రికార్డ్ లాంటి ఎన్నో రికార్డులు వీరిని వరించాయి. ఎన్నో అవరోధాలు, ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని తనకంటూ ఒక విభిన్న శైలి నేర్పరచుకొని ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు. ఎంతో మంది కళాకారులకు సామాజికవేత్తలకు సేవాపరంగా కొనసాగుతున్న వారికి చేయూతనందించి వారిని ప్రోత్సహిస్తున్న బుచ్చేశ్వర్‌రావు ఎందరికో స్ఫూర్తిదాయకమని చెప్పవచ్చు. మన దేశ రాజధాని ఢిల్లీలో రెండు సార్లు పురస్కారాలు అందుకుని స్ఫూర్తిదాయకంగా నిలిచారు. ఎంతో మంది భవిష్యత్తుకు బంగారు బాట వేస్తూ చిన్నారులను ప్రోత్సహిస్తూ, కళాకారులను గౌరవిస్తూ విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తున్న వారిని గుర్తించి వారికి ప్రోత్సాహాన్ని ఇస్తున్న బుచ్చేశ్వర్‌రావు స్ఫూర్తిదాయకమని చెప్పవచ్చు. ఎటువంటి వివాదాలకు తావు లేకుండా తాను ఎన్నుకున్న రంగంలో కష్టపడే నైజాన్ని అలవాటు చేసుకుని తనకంటూ ఒక సుదుర్గ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు.

# మైదుకూరులో ఆక్రమణల తొలగింపు

### -18 సెంట్ల ప్రభుత్వ భూమి స్వాధీనం -రైతు బజార్‌కు కేటాయింపు

(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జులై 30)
మైదుకూరు పట్టణంలో ప్రభుత్వ భూముల ఆక్రమణల పై అధికారులు ఉక్కుపాదం మోపారు. కడప రోడ్డులోని చర్చి సమీపంలో అక్రమంగా వెలిసిన రేకుల షెడ్లను గురువారం తెల్లవారుజామున రెవెన్యూ, మున్సిపల్ అధికారులు భారీ పోలీసు బందోబస్తు మధ్య తొలగించి, ఆ స్థలాన్ని రైతు బజార్ కోసం కేటాయించారు.





**తెల్లవారుజాము 3 గంటల నుంచే ఆపరేషన్ :**
కడప రోడ్డులోని చర్చి వద్ద సుమారు 18 సెంట్ల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించిన అధికారులు గురువారం ఉదయం 3 గంటల ప్రాంతంలోనే రంగంలోకి దిగారు. మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది పొక్లెయిన్లతో సంఘటనా స్థలానికి చేరుకుని, అక్రమంగా నిర్మించిన చిన్నచిన్న రేకుల షెడ్లను పూర్తిగా తొలగించారు. అధికారులు సమర్థవంతంగా వ్యవహరించి ఆ విలువైన స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి కాపాడారు.

**రైతు బజార్‌కు స్థలం కేటాయింపు :**
స్వాధీనం చేసుకున్న ఈ 18 సెంట్ల భూమిని మైదుకూరు మార్కెట్ యార్డ్‌కు సంబంధించిన రైతు బజార్ నిర్మాణం కోసం కేటాయిస్తున్నట్లు అధికారులు తెలిపారు. స్థానిక రైతులు, ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

**అధికారుల పర్యవేక్షణ, భారీ బందోబస్తు :**
ఈ ఆక్రమణల తొలగింపు కార్యక్రమంలో మైదుకూరు మండల తహశీల్దార్ రాజా నరసింహ, మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, మైదుకూరు టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి స్వయంగా పాల్గొని చర్యలను పర్యవేక్షించారు. ఆక్రమణల తొలగింపు సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, గొడవలు జరగకుండా టౌన్ సి.ఐ రమణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ముందస్తుగా భారీ బందోబస్తు నిర్వహించారు.

**ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు :**
ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో ట్రాఫిక్, సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకే తెల్లవారుజామున ఈ ఆపరేషన్ చేపట్టినట్లు తెలిపారు. ఇకపై కూడా పట్టణ పరిధిలోని ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

# యువత లక్ష్యసాధనతో పాటు సామాజిక బాధ్యతను కూడా అలవరుచుకోవాలి

### జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్

(షణ్ముఖ వెలుగు, పులివెందుల, జులై 30)
జెఎన్‌టియు ఇంజనీరింగ్ విద్యార్థులతో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ముఖాముఖి కార్యక్రమం గురువారం నిర్వహించారు. పులివెందుల జె.ఎన్.టి.యు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులతో ఆత్మీయంగా సంభాషించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైబర్ నేరాల నివారణ, డిజిటల్ భద్రత, మహిళలు మరియు చిన్నారుల రక్షణ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల పాటింపు, సోషల్ మీడియా బాధ్యతాయుత వినియోగం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. భవిష్యత్తులో పోలీసింగ్ ఎలా ఉండాలని కోరుకుంటున్నారు, ఎలాంటి మార్పులు ఆశిస్తున్నారు అనే అంశాలపై, పోలీస్ శాఖతో వారికి ఎదురైన అనుభవాలను ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రంగంలో కూడా విద్యార్థుల పాత్ర కీలకమని, సమాజంలో విద్యార్థుల పాత్ర ముఖ్యమైనదన్నారు. పోలీస్‌శాఖతో వారి జీవితంలో ఎదురైన అనుభవాలను జిల్లా ఎస్పీ తో పంచుకున్నారు. నేటి ఆధునిక యుగంలో భద్రతా పరంగా పొంచి ఉన్న ప్రమాదాలను విద్యార్థులకు వివరించడం జరిగిందన్నారు. విద్యార్థులు తమ విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందించుకోవాలని జిల్లా ఎస్‌పీ విద్యార్థులకు సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సానుకూల దిశగా వినియోగిస్తూ సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. సైబర్ మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు లేదా బ్యాంకు వివరాలను ఎవరికీ పంచుకోవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్ 112ను సంప్రదించాలని, మహిళల భద్రత కోసం అందుబాటులో ఉన్న శక్తి యాప్ ను వినియోగించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు జిల్లా ఎస్‌పీ సమాధానాలు ఇచ్చి, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి దేశానికి, సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పులివెందుల డిఎస్పీ బి మురళి, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ ఎన్ సుధాకర్, పులివెందుల అర్బన్ సిఐ శ్రీరామ్, జెఎన్‌టియు ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డి విష్ణువర్ధన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శేష మహేశ్వరమ్మ, కాలేజీ సిబ్బంది, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.









# కార్మికలోకం కన్నెర్ర...

**ప్రభుత్వ నిర్లక్ష్యం పై కలెక్టరేట్‌కు కదిలిన శ్రామిక శక్తి**
**జిల్లా నలుమూలల నుంచి పోటెత్తిన**
**కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు**
**రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని ప్రభుత్వానికి అల్టిమేటం**
**నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకు డిమాండ్**
**కార్మిక వ్యతిరేక విధానాల పై తీవ్ర ఆగ్రహం**
**సమస్యలు పరిష్కరించకుంటే**
**ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరిక**









**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 30)**
రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పట్ల అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరి, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రకాశం జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, సంఘటిత-అసంఘటిత రంగాల కార్మికులు గురువారం ఒంగోలు కలెక్టరేట్ కు పోటెత్తారు. సీఐటీయూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా నిర్వహించిన భారీ ధర్నాతో కలెక్టరేట్ పరిసరాలు ఎర్రజెండాలతో ఎర్రబారగా, కార్మిక నినాదాలతో దద్దరిల్లాయి. చేతుల్లో ప్లకార్డులు, ఎర్రజెండాలు పట్టుకుని కదం తొక్కిన కార్మికులు ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండించారు. 2009 తర్వాత పెండింగ్‌లో ఉన్న కనీస వేతనాల సవరణను వెంటనే చేపట్టి నెలకు రూ.26 వేల కనీస వేతనం ప్రకటించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వానికి స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 71 షెడ్యూల్డ్ వృత్తుల్లో పనిచేస్తున్న 55 లక్షల మంది కార్మికులకు 2009 తర్వాత ఇప్పటివరకు కనీస వేతనాలు సవరించకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ప్రతి ఐదేళ్లకోసారి వేతనాలు సవరించాల్సిన చట్టాన్ని ప్రభుత్వాలే తుంగలో తొక్కాయని మండిపడ్డారు. కార్పొరేట్ సంస్థలకు వేల కోట్ల రాయితీలు ప్రకటించే ప్రభుత్వాలకు కార్మికులకు జీవనోపాధికి సరిపడే వేతనాలు పెంచే చిత్తశుద్ధి లేకపోవడం దారుణమన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, విద్య, వైద్య వ్యయాలను దృష్టిలో ఉంచుకుని నెలకు రూ.26 వేల కంటే తక్కువ కాకుండా కనీస వేతనం ప్రకటించి అన్ని రంగాల్లో కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రానైట్ క్వారీలు, పాలిషింగ్ యూనిట్లు, ఆక్వా కంపెనీలు, హేచరీలు, పొగాకు గోదాములు, ఫార్మా పరిశ్రమలు, ప్రైవేట్ విద్యా, వైద్య సంస్థలు, షాపింగ్ మాల్స్, పెట్రోల్ బంకులు, సెక్యూరిటీ సంస్థలు తదితర రంగాల్లో కార్మికులకు నెలకు రూ.8 వేల నుంచి రూ.13 వేల వరకు మాత్రమే వేతనాలు చెల్లిస్తూ దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ఎనిమిది గంటల పని చట్టాన్ని ఉల్లంఘించి 12 గంటల వరకు పని చేయిస్తున్నా ఓవర్‌టైం వేతనాలు ఇవ్వడం లేదన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి మాట్లాడుతూ ఎనిమిది గంటల పనివిధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని, అదనపు పనికి డబుల్ ఓవర్‌టైం వేతనం చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ, బోనస్, చెల్లింపు సెలవులు వంటి చట్టబద్ధ హక్కులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని కోరారు. ఇతర వక్తలు మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉద్యోగ భద్రత లేక, అరకొర వేతనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, మినిమం టైం స్కేలు అమలు చేసి, దీర్ఘకాలంగా పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. మహిళా కార్మికులకు పురుషుల కంటే తక్కువ వేతనాలు చెల్లించడం, అనేక సంస్థల్లో కూర్చునే సౌకర్యం, మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు లేకపోవడం దుర్భర పరిస్థితులకు నిదర్శనమన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, గ్రాట్యుటీ, గుర్తింపు కార్డులు వంటి చట్టబద్ధ హక్కులు అమలు కాక లక్షలాది మంది కార్మికులు అస్థిరతలో పనిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్వచ్ఛభారత్, గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు నెలనెలా వేతనాలు చెల్లించకుండా ఐదు, ఆరు నెలలకు ఒకసారి మాత్రమే జీతాలు ఇస్తున్నారని, భద్రతా పరికరాలు, రక్షణ సామగ్రి, తాగునీరు వంటి కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని విమర్శించారు. వలస కార్మికుల రక్షణ చట్టం అమలు కావడం లేదని, పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించక ప్రమాదాలు పెరుగుతున్నాయని, కాలుష్యంతో గ్రామాల ప్రజలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రవాణా, హమాలీ, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ప్రమాద బీమా, గుర్తింపు కార్డులు అందించాలని, కార్మిక శాఖ, ఫ్యాక్టరీల శాఖ, కాలుష్య నియంత్రణ శాఖ, పీఎఫ్, ఈఎస్ఐ, రవాణా, పోలీసు శాఖలు కార్మిక చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల యాజమాన్యాలు, సంబంధిత శాఖలు, కార్మిక సంఘాలతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేసి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.పీటీపీ నాయకుడు గంజి శ్రీనివాసులు అన్ని రంగాల కార్మికులకు కనీస వేతనాలు, సామాజిక భద్రత, ఉద్యోగ భద్రత, చట్టబద్ధ హక్కులు కల్పించాలని కోరారు.

**పోరాటానికి విస్తృత సంఘీభావం**

ధర్నాకు వివిధ ఉద్యోగ, కార్మిక, పెన్షనర్ల సంఘాలు సంఘీభావం ప్రకటించాయి. సీఐటీయూ జిల్లా నాయకులు సిహెచ్ మంజుందార్, జి శ్రీనివాసులు, తాండవ రంగారావు, టి మహేష్, జి రమేష్, యు ఆదిలక్ష్మి, జి వెంకటేశ్వర్లు, తాంగిరాల వెంకటేశ్వర్లు, బంకా సుబ్బారావు, పి. ఆంజనేయులు, పి శ్రీనివాసులు మాట్లాడుతూ కార్మికుల శ్రమను దోపిడీ చేసే విధానాలను ప్రభుత్వం ప్రోత్సహించడం దురదృష్టకరమన్నారు. కనీస వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, కార్మిక చట్టాల అమలుపై ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకులు ఎ.వి. పుల్లారావు, జి. శేషయ్య, సిహెచ్. రాంబాబు, మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లూరి వెంకటేశ్వర్లు, సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకురాలు కళ్యాణి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కొర్నెపాటి శ్రీనివాసరావు, విజయమ్మ, ఆదామ్, మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు ఉదయ్ కిరణ్, సిహెచ్. చిరంజీవి, గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు పి. శ్రీనివాసరావు, బానుప్రకాష్ ఏలిషా, గ్రీన్ అంబాసిడర్స్ నాయకుడు ఇశ్రాయేల్, అర్బన్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు హనుమంతరావు, ఎన్‌హెచ్‌ఎం ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు ఏడుకొండలు, 104 ఉద్యోగ సంఘం నాయకుడు వాసు, 108 ఉద్యోగ సంఘ నాయకుడు చెన్నయ్య, గ్రానైట్ పాలిషింగ్ వర్కర్స్ యూనియన్ నాయకుడు ఓబులేసు, ఆటో అండ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ నాయకుడు తంబి శ్రీనివాసులు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రామారావు, సయ్యద్ హుస్సేన్, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకుడు పి. శ్రీనివాసరావు, గురుకులం సెక్యూరిటీ గార్డ్స్ నాయకులు రజియా, మరియదాసు, వీఆర్‌ఏ అసోసియేషన్ నాయకుడు స్వాములు, స్ట్రీట్ వెండర్స్ యూనియన్ నాయకుడు ఎం లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా రెవిన్యూ అధికారి పివి రమణకు అందజేశారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతమైన ఉద్యమాలకు శ్రీకారం చుడతామని, కార్మికుల ఆగ్రహాన్ని ప్రభుత్వం తక్కువ అంచనా వేయవద్దని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు.



# భీమవరం గ్రామంలో జోరుగా 'ఇంటింటికి తెలుగుదేశం'





**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 30)**
మండల పరిధిలోని భీమవరం గ్రామంలో గురువారం నిర్వహించిన "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. గ్రామంలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడంతో పాటు పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా ముందుకు సాగుతున్నారు. నాయకులు ప్రతి ఇంటికీ వెళ్తూ ప్రజల కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్తామని ఈ సందర్భంగా జాజుల రవి పేర్కొన్నారు. స్థానిక నివాసితులు నాయకులకు ఘనస్వాగతం పలికి పలు సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో భీమవరం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జాజుల రవి, యూనిట్ ఇంచార్జి జివి చలపతిరావు, గ్రామ పార్టీ మాజీ అధ్యక్షులు మల్లవరపు కోటిరెడ్డి, చింతం లీలా కృష్ణరెడ్డి, సీనియర్ నేత కాకర్లపూడి వెంకటరమరాజు, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

# వైఎస్ కుటుంబంలో తీరని శోకం

**వైఎస్ ఆనంద్‌రెడ్డి అనారోగ్యంతో కన్నుమూత**
**నేడు వైఎస్సార్ జిల్లాకు రానున్న**
**మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి**
**ఆనంద్‌రెడ్డి భౌతికకాయానికి అంజలి ఘటించనున్న**
**జగన్, పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు**



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జులై 30)**
మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. వైఎస్ భాస్కర్‌రెడ్డి సోదరుడు, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి పెద్దనాన్న వైఎస్ ఆనంద్‌రెడ్డి అనారోగ్యంతో చికిత్స పొందుతూ కన్నుమూశారు. గత కొంతకాలంగా వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆనంద్‌రెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో గురువారం తుదిశ్వాస విడిచారు. ఆనంద్‌రెడ్డి మరణ వార్త తెలియగానే వైఎస్సార్‌సీపీ శ్రేణులు, వైఎస్ కుటుంబ అభిమానులు, జిల్లా ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. తన పెదనాన్న వరసయ్యే వైఎస్ ఆనంద్‌రెడ్డి మృతి పట్ల వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. వైఎస్ ఆనంద్‌రెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించేందుకు వైఎస్ జగన్ శుక్రవారం రానున్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, అంత్యక్రియల కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. వైఎస్ ఆనంద్‌రెడ్డి మృతి వార్త తెలిసిన వెంటనే ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కుటుంబ సభ్యులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు. ఆనంద్‌రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ మున్సిపల్, మండల స్థాయి నాయకులు, అభిమానులు తమ సానుభూతిని తెలిపారు. శుక్రవారం జరగనున్న అంతిమ యాత్రకు భారీగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరానున్నారు.

# రాజ్యాంగాన్ని మార్చి దేశాన్ని రెండు ముక్కలు చేసేందుకు బిజెపి కుట్ర




**దేశాన్ని రెండు ముక్కలుగా చేసేందుకు బిజెపి కుట్రలు**
**జంతర్ మంతర్ ఘటనలో విద్యార్థులపై పెట్టిన కేసులను**
**బే షరతుగా ఎత్తివేయాలి**
**కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతా మోహన్**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 30)**
భారత రాజ్యాంగాన్ని మార్చేదానికి ఒక్కో యంపికి రూ.50 కోట్ల ఇచ్చి కొంటున్నట్లు ఢిల్లీలో అందరూ అనుకుంటున్నారని మాజీ కేంద్రమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతా మోహన్ ఆరోపించారు. ఒంగోలులోని ఒక ప్రైవేటు హోటల్ లో గురువారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతా మోహన్ మాట్లాడుతూ ఆగస్టులో అంబేద్కర్ రాజ్యాంగం పోయి, అమిత్ షా రాజ్యాంగం అమలు చేసే దానికి బిజెపి పక్క ప్లాన్ చేస్తోందని విమర్శించారు.ఉత్తర భారతదేశానికి 500 లోక్ సభ సీట్లు, దక్షిణ భారతదేశానికి 300 లోక్ సభ సీట్లు వస్తాయని అదే జరిగితే భవిష్యత్తులో భారతదేశం రెండుగా విడిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.ఢిల్లీ ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని,కేంద్రం ప్రభుత్వం, విద్యార్థి జేఏసీ కి ఇచ్చిన అన్నీ హామీలను అమలు చేయాలి. కేవలం విద్యాశాఖ మంత్రి రాజీనామాతో సరిపెట్టిందన్నారు.మిగిలిన హామీలను ఎప్పటిలోగా అమలు చేస్తారో కేంద్రం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి రూ.30 కోట్ల ప్రజాధనం ఖర్చు చేయడం తగదని హితవు పలికారు.రాష్ట్ర ప్రభుత్వం పొదుపు మంత్రం జపిస్తూ.. మరో వైపు ప్రజాధనాన్ని వృధా ఖర్చులకు వాడుకుంటోందని విమర్శించారు.మోడీ మెప్పు కోసం చంద్రబాబు నాయుడు తాపత్రయంపడుతున్నారన్నారు.15 వేల మందితో నృత్య ప్రదర్శన అవసరమా? అని ప్రశ్నించారు. తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయానికి మన్మోహన్ సింగ్ వస్తే, లక్ష రూపాయలు ఖర్చు చేసి, 500 మందితో సింపుల్ గా సభ పెట్టామన్నారు.భోగాపురం భోగాలు ఆపి,ప్రజాధనాన్ని కాపాడాలన్నారు. ఎవరబ్బా సొమ్ము అని రూ.30 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.రాయలసీమ నుంచి నారా చంద్రబాబు నాయుడు, 19 సంవత్సరాలు , వైయస్సార్ కుటుంబం 11 ఏళ్లు, ఈ రెండు కుటుంబాలు కలిపి 30 ఏళ్లు ముఖ్యమంత్రులుగా అధికారాన్ని, పెత్తనాన్ని చెలాయించారన్నారు.30 ఏళ్ల పరిపాలించి, రూ.10 లక్షల కోట్ల అప్పులు ప్రజల నెత్తిన పెట్టారన్నారు. రూ.50,000 కోట్ల ప్రతి సంవత్సరం వడ్డీలు కట్టాల్సిన పరిస్థితికి కారణం ఆ రెండు కుటుంబాలే అని విమర్శించారు.ఆ రెండు కుటుంబాలు పాదయాత్రలు చేశారు. బిలినియర్లు, మిలీనియర్లు అయ్యారు. పాదయాత్రలో వారు నడిచిన ప్రతి అడుగుకూ కోటి రూపాయలు సంపాదించారని ఆరోపించారు.కాపులు , బలిజలు ముఖ్యమంత్రి కావాలని అనుకుంటున్నారన్నారు.టిడిపిలో కాలేరు. వైసీపీలో అసలే కాలేరు. బలిజలు, కాపులు కాంగ్రెస్ లోకి రండి. 2029లో ముఖ్యమంత్రి అవుతారని పిలుపునిచ్చారు. ఈ మీడియా సమావేశంలో రిటైర్డ్ డిఈఓ మధుసూదన్‌రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు విజేంద్ర బహుజన్, తదితరులు పాల్గొన్నారు.

షణ్ముఖ
# వెలుగు
ePaper
www.shanmukhavelugu.com


## నేటితో ముగియనున్న పంటల బీమా గడువు
## పొదిలి వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 30)
ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన కింద ఖరీఫ్ 2026 పంటల బీమా నమోదుకు జులై 31వ తేదీ చివరి అవకాశమని పొదిలి మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ పంటలకు బీమా రక్షణ కల్పించుకోవాలని ఆయన కోరారు. పంట నష్టాల నుండి ఆర్థిక రక్షణ పొందడానికి రైతులు ముందస్తుగా బీమా ప్రీమియం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవడం తప్పనిసరి అని పేర్కొన్నారు. వరి పంట ఎకరానికి రూ.860, కంది పంటకు రూ.430, సజ్జకు రూ.156, మినుములుకు రూ.205, నువ్వులుకు రూ.180, ఎండుమిరపకు రూ.4,500లు ప్రీవియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. నమోదు చేసుకోవాలనుకునే రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాసుబుక్, పంట ధ్రువీకరణ పత్రము, బ్యాంక్ ఖాతా వివరాలు, మొబైల్ నంబర్‌తో దగ్గరలోని కామన్ సర్వీస్ సెంటర్ ను సంప్రదించి స్వయంగా బీమా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. చివరి రోజు వరకు వేచి చూడకుండా వెంటనే నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని వ్యవసాయ అధికారి సూచించారు.

## పమిడిపాడులో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం



(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, జులై 30)
మండలంలోని పమిడిపాడు గ్రామంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీనివాసరావు గురువారం తెలియచేశారు. సబ్ స్టేషన్ మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. కావున ప్రజలందరూ విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

## కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు



(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, జులై 30)
కూటమి ప్రభుత్వం రాష్ట్రములో అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజాపాలనలో ముందుకు దూసుకొని వెళు తున్నది అని పెద్దరవీడు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మెట్టు శ్రీనివాసరెడ్డి తెలియజేసారు. ఈ సందర్భంగా పెద్దరవీడు మండలము రామాయపాలెం గ్రామములో జరిగిన ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమములో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు, క్లస్టర్ ఇంచార్జి జడ్డా రవి, యూనిట్ ఇంచార్జ్ దొడ్డా నాసర్‌రెడ్డి, సానికవరం గ్రామ టీడీపీ పార్టీ అధ్యక్షులు గుంటక యెగిరెడ్డి, రేషన్ షాప్ డీలర్ బుజ్జి, బూత్ ఇంచార్జిలు రంగస్వామి, శ్రీను, మద్దలకట్ట గ్రామపార్టీ అధ్యక్షులు వెన్నా రామిరెడ్డి, రామాయపాలెం గ్రామ పార్టీ అధ్యక్షులు బొచ్చు ఆదినారాయణరెడ్డి, బూత్ ఇంచార్జ్ కొమ్ముల గురవయ్య, వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు చల్లా ఆంజినేయులు, కొమ్ముల చిన్నన్న, పానుగంటి రమేష్, తిరుమలరెడ్డి వెంకటనారాయణరెడ్డి, మాడుగుల, మల్లారెడ్డి, బొచ్చు, మల్లారెడ్డి, యలకపాటి కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కుబేర వైన్స్ ఎస్సీ, ఎస్టీ కేసులో దర్శి డిఎస్పీ విచారణ

### కుబేర వైన్స్‌లో బార్‌లా బహిరంగ మద్యం తాగిస్తున్న కుబేర వైన్స్ లైసెన్స్ రద్దు చేయాలి
### అగ్రకుల నిందితులను అరెస్టు చేయాలని
### దళిత నేత నీలం డిమాండ్

(షణ్ముఖ వెలుగు, అద్దంకి, జులై 30)
అద్దంకి మండలం తిమ్మాయపాలెంలోని కుబేర వైన్స్ వద్ద గత నెల 28వ తేదీన కుబేర వైన్స లో దళిత యువకులు కురుగంటి రవితేజ, కురుగంటి శ్యామ్ కుమార్‌ల పై హత్య ప్రయత్నం చేసిన అగ్రకుల నిందితులను అరెస్టు చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నాగేంద్రరావు దర్శి డిఎస్పిని డిమాండ్ చేశారు. గత నెల 28వ తేదీన తిమ్మాయిపాలెం కుబేర వైన్స్లో కురుగంటి రవితేజ, గురుగంటి శ్యామ్ కుమార్ లు మద్యం సేవిస్తుండగా అంగలకుర్తి రమేష్ అనే వ్యక్తితో గొడవ జరిగింది. వీరు ఒకరిపై ఒకరు కుర్చీలు విసురుకొని వేచుకొనుచుండగా ప్లాస్టిక్ కుర్చీలు విరిగిపోయినవి. అంతట కుబేర వైన్స్ కౌంటర్లో డ్యూటీ నిర్వహించే అశోక్, రామకృష్ణ అను అగ్రకుల దుండగులు దళిత యువకుడైన కురుగంటి రవితేజ పై దాడి చేశారు. మా వైన్ షాపులోకి వచ్చి మీకు ఎంత ధైర్యంరా మాల, మాదిగ నా కొడుకుల్లారా అంటూ వీరంగం సృష్టించారు. విరిగిపోయిన కుర్చీ విలువ చెల్లిస్తాము అన్న వినకుండా ఇనపరాడ్డుతో కురుగుంట రవితేజ పై దాడి చేశారు. చుట్టుపక్కల వారు తప్పించి రవితేజ ను అదే రోజు చికిత్స నిమిత్తం అద్దంకి గవర్నమెంట్ హాస్పటల్లో చేర్పించారు. ఈ సమాచారాన్ని అందుకున్న అద్దంకి ఏ ఎస్ ఐ తమను కమ్మ కులానికి చెందిన కుబేర వైన్స్ నిర్వాహకులు అశోక్, రామకృష్ణ అనువారు కులం పేరుతో దూషిస్తూ హత్యాయత్నం చేశారు అని చెప్పిన కులం ప్రస్తావన లేకుండా స్టేట్మెంట్ రికార్డ్ చేశాడన్నారు. 29.6.26న మధ్యాహ్నం 12.30 గంటలకు స్టేట్మెంట్ రికార్డ్ చేసుకున్నాడు కానీ మెడికో లీగల్ కేసు అయినప్పటికీ అద్దంకి సీఐ సుబ్బరాజు వెంటనే కేసు కూడా కట్టలేదన్నారు. ఈ విషయం పై బాధితులు తమను ఆశ్రయించడంతో తాను అద్దంకి సీఐ సుబ్బరాజు కు ఫోన్ చేయడంతో హెడ్ కానిస్టేబుల్ దేవరకొండ రవితో 30వ తేదీన క్రైమ్ నెంబర్ 133/26 సాధారణ బిఎన్ఎస్ సెక్షన్ కింద కేసు మొక్కుబడిగా నమోదు చేశారన్నారు. తాము మరల అద్దంకి పోలీస్ స్టేషన్లో దళితులైన కురుగంటి రవితేజ ఫిర్యాదును ఎస్సీ, ఎస్టీ కేసుగా మార్చాలని ఈ నెల 6వ తేదీన జిల్లా ఎస్పీ హర్షవర్ధన రాజుకు ఫిర్యాదు చేయించామన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో ఈ కేసును తప్పనిసరి పరిస్థితుల్లో అద్దంకి సిఐ సుబ్బరాజు ఎస్సీ, ఎస్టీ కేసుగా ఈ నెల 25వ తేదీన ఎస్సీ, ఎస్టీ కోర్టులో ఎస్సీ, ఎస్టీ కేసుగా మారుస్తూ మెమో ఫైల్ చేశారన్నారు. అంతట కురుగంటి రవితేజ ఎస్సీ, ఎస్టీ కేసును ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు దర్శి డిఎస్పి బాలమురళీకృష్ణను విచారణ అధికారిగా నియమించారు. గురువారం కురుగుగంటి రవితేజ ఎస్సీ, ఎస్టీ కేసును దర్శి డిఎస్పీ బాలమురళీకృష్ణ తిమ్మాయపాలెంలోని కుబేర వైన్స్ వద్ద దళితుల పై జరిగిన దాడి ఘటన ప్రదేశాన్ని సందర్శించారు. సాక్షులను విచారించారు. వీడియో కూడా పరిశీలించారు. తరువాత అద్దంకి పోలీస్ స్టేషన్ వద్ద దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు కుబేర వైన్స్‌లో మద్యం అమ్మ కాలే జరగాలని, అక్కడ సిట్టింగ్ కుర్చీలు వేయించి అనాధికారికంగా మద్యం తాగించకూడదని కుబేర వైన్స్ లైసెన్స్ రద్దు చేయడానికి కలెక్టర్, ఎస్పీ, ఎక్సైజ్ సూపర్నెంట్ కు పోలీస్ శాఖ ద్వారా ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఈ ఎస్సీ, ఎస్టీ కేసులో కుబేర వైన్స్ నిర్వాహకులైన అశోక్, రామకృష్ణ అగ్రకుల ముద్దాయిలను అరెస్టు చేయాలని నీలం నాగేంద్రరావు దర్శి డిఎస్పి బాలమురళీకృష్ణను డిమాండ్ చేశారు. దర్శి డీఎస్పీ వెంట సిఐ సుబ్బరాజు తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్ష కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాను రవి, మేడికొండ మురళి, ఎర్రమల శ్రీనివాసరావు, బాధితులు, తదితరులు ఉన్నారు.




# ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ప్రశంసాపత్రాల అందజేత

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 30)
ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతూ విద్యాభ్యాసంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్, క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఎంపిక చేసిన నలుగురు ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ప్రశంసాపత్రాలను ఆమె చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఇలాంటి ప్రోత్సాహకాలు వారిలో మరింత ఉత్సాహాన్ని నింపి, భవిష్యత్తులో మంచి లక్ష్యాలను సాధించేలా దోహదపడతాయని ఆమె చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి జిల్లాకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆమె ఆకాంక్షించారు. చీరాల, ఒంగోలు ప్రాంతాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ.10,000 చొప్పున ఆర్థిక సాయంతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఏ దివ్య హర్షిత, పి ధనలక్ష్మి, కె ఉదయభార్గవి, ఎం స్మైలీ, ఈ కార్యక్రమంలో క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్ తరపున డివిజనల్ మేనేజర్ ఎం. జగదీష్, ఏరియా మేనేజర్ శేగు వెంకట గిరిబాబు, సంస్థ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.






# ఎల్‌నినో విపత్తు పై అధికారుల సమావేశం

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 30)
మండల కేంద్రమైన ఉలవపాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఎల్ నిన్నో విపత్తులను ఎదుర్కొనుటకు సమాయత్తం చేయుటకు ఎంపీడీవో బి సురేష్ అధ్యక్షతన మండల స్థాయి సమన్వయ సమావేశము మండల పరిషత్ కార్యాలయము ఉలవపాడు నందు నిర్వహించారు. ఈ సమావేశమునకు మండల తహసిల్దార్ టి రవిశంకర్, అగ్రికల్చర్ ఆఫీసర్, విద్యాశాఖ, ఉద్యానవన శాఖ, పశుసంవర్ధక శాఖ, గ్రామీణ నీటి సరఫరా, ఇరిగేషన్, మత్స్య శాఖ, డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ అభివృద్ధి అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెటర్నరీ అసిస్టెంట్లు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అసిస్టెంట్లు పాల్గొన్నారు.




### ఇతర రాష్ట్రాల్లో సమగ్ర శిక్ష ఉద్యోగుల రెగ్యులరైజేషన్ సాధ్యమైనప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు సాధ్యం కాదు?
### ఛలో కలెక్టరేట్‌లో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సమగ్ర శిక్ష ఉద్యోగులు



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జులై 30)
సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పార్ట్ టైమ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జిల్లా కలెక్టరేట్ వద్ద ఏపీ స్టేట్ సమగ్రశిక్ష కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జేఏసీ ఆధ్వర్యంలో "ఛలో కలెక్టరేట్" కార్యక్రమం నిర్వహించి, జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, హర్యానా, మధ్యప్రదేశ్, సిక్కిం, అస్సాం, మణిపూర్ రాష్ట్రాల్లో సమగ్ర శిక్ష ఉద్యోగులకు రెగ్యులరైజేషన్, ఉద్యోగ భద్రతకు సంబంధించిన నిర్ణయాలు తీసుకున్నప్పుడు, ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు సాధ్యం కావడంలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యా వ్యవస్థకు వెన్నెముకగా పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎన్నో సంవత్సరాలుగా నిరంతరాయంగా సేవలందిస్తున్నప్పటికీ, ఇప్పటికీ ఉద్యోగ భద్రత, హెచ్‌ఆర్ పాలసీ, సరైన వేతనాలు, సామాజిక భద్రతా ప్రయోజనాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, జీతాలు ఇప్పటికీ చెల్లించకపోవడం వల్ల వేలాది మంది ఉద్యోగులు, వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి జూన్, జూలై నెలల జీతాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం వెంటనే డిమాండ్లను అమలు చేయాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి. సమగ్ర హెచ్‌ఆర్ పాలసీని తక్షణమే అమలు చేయాలి. మినిమం ఆఫ్ ఆఫ్ టైం స్కేల్ అమలు చేసి తక్షణమే వేతనాలు పెంచాలి. ప్రతి నెలా సకాలంలో జీతాలు చెల్లించాలి. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా మార్చాలి. పార్ట్ టైమ్ విధానం తొలగించి ఫుల్ టైమ్ ఉద్యోగులుగా మార్చాలి. పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచి ఈపీఎఫ్, గ్రాట్యుటీ, పెన్షన్, తదితర ప్రయోజనాలు కల్పించాలి. ఉద్యోగులకు ఆరోగ్య భద్రత, ఉద్యోగ భద్రత కల్పించాలి. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. టీచర్స్ డీఎస్సీతో పాటు అన్ని ప్రభుత్వ రెగ్యులర్ ఉద్యోగ నియామకాలలో సమగ్ర శిక్ష ఉద్యోగులకు సర్వీస్ వెయిటేజ్ కల్పించాలి. ప్రభుత్వం వెంటనే ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పై సానుకూల నిర్ణయం తీసుకొని, జూన్, జూలై నెలల జీతాలు చెల్లించేందుకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆగస్టు 24న నిర్వహించనున్న "ఛలో విజయవాడ" కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా భారీ ఎత్తున విజయవంతం చేస్తామని, వేలాది మంది సమగ్రశిక్ష ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని తమహక్కుల సాధనకోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# సమన్వయంతోనే మానవ అక్రమ రవాణా నిర్మూలన సాధ్యం

## అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ అవగాహన ర్యాలీలో ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 30)

సమాజంలో మానవ అక్రమ రవాణా అనే అమానుషమైన చర్యను పూర్తిస్థాయిలో నిర్మూలించాలంటే ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ ,వివిధ స్వచ్ఛంద సంస్థలు పరస్పర సమన్వయంతో కలిసి పనిచేయవలసిన అవసరం ఉందని ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి స్పష్టం చేశారు. గురువారం అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా కార్మిక శాఖ, బాలల సంరక్షణ యూనిట్, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, పోలీసు వ్యవస్థ, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, దిశ పోలీస్ సిబ్బంది, హెల్ప్ , సార్డ్స్ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ప్రకాశం భవనం నుండి ఒంగోలు రిమ్స్ ఆసుపత్రి వరకు నిర్వహించిన భారీ అవగాహన ర్యాలీని జాయింట్ కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి సుదీర్ఘంగా మాట్లాడుతూ, ఈ సంవత్సరం "మోసం వెనుక దాగి ఉన్న నిజాలను గుర్తించి, బాధితులను రక్షించటం" అనే ప్రధాన ఇతివృత్తంతో జిల్లా వ్యాప్తంగా విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచదేశాల్లో మానవ అక్రమ రవాణా అత్యంత హేయమైన చర్యగా మారిందని, అంతర్జాతీయ స్థాయిలో నేరాల జాబితాలో ఇది రెండవ స్థానంలో నిలవడం తీవ్ర ఆందోళనకరమైన విషయమని వ్యాఖ్యానించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సైబర్ నేరగాళ్ళు మరియు అక్రమ రవాణాదారులు సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ, సోషల్ మీడియా వేదికగా పరిచయాలు పెంచుకుని అమాయకులకు ప్రేమ పేరుతోనూ, ఉద్యోగ అవకాశాల పేరుతోనూ మాయమాటలు చెబుతున్నారని విచారం వ్యక్తం చేశారు. బాధితుల ఆర్థిక బలహీనతలను ఆసరాగా చేసుకుని వారిని వివిధ రాష్ట్రాలకు, విదేశాలకు తరలించి బలవంతంగా




వ్యభిచార వృత్తిలోకి నెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా, చిన్నపిల్లలను కూడా లక్ష్యంగా చేసుకుని అక్రమ రవాణాకు గురిచేస్తున్నారని, వారిని ప్రమాదకరమైన ఫ్యాక్టరీలలో చట్టవిరుద్ధంగా పనుల్లోకి దించి వారి హక్కులను కాలరాస్తున్నారని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. కొందరు సంఘవిద్రోహ శక్తులు అప్పుల ఊబిలో కురుకుపోయిన పేద ప్రజల పేదరికాన్ని ఆసరాగా చేసుకుని, అధిక మొత్తంలో డబ్బులు ఇస్తామని ఆశ చూపి వారిని విదేశాలకు తరలిస్తున్నారన్నారు. అక్కడ వారి శరీర అవయవాలను బలవంతంగా దోపిడీ చేస్తూ అమాయకులను మోసం చేస్తున్నారని, ఇది మానవ సమాజానికే తీవ్ర ముప్పుగా పరిణమించిందని అన్నారు. ఇటువంటి వివిధ రూపాల్లో విస్తరిస్తున్న మానవ అక్రమ రవాణాను అరికట్టాలంటే ఈ నేరాలకు పాల్పడుతున్న ముఠాలను తక్షణమే గుర్తించి, వారిపై చట్టప్రకారమైన కఠిన చర్యలు తీసుకుని దోషులకు శిక్షలు పడేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. సమాజంలో మానవ అక్రమ రవాణా జరిగే మార్గాలపై , అక్రమ రవాణాదారుల మోసపూరిత వ్యూహాలపై ప్రజలకు నిరంతరం చైతన్యం కలిగించాల్సిన అవసరం ఉందని జాయింట్ కలెక్టర్ తెలిపారు. అందుకోసం కళాశాలల్లోనూ, సమాజంలోనూ వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన మానవ అక్రమ రవాణా నిరోధక యూనిట్ ద్వారా ప్రతి నెల సమన్వయ సమావేశం నిర్వహించి జిల్లాలోని పరిస్థితులను క్షుణ్ణంగా సమీక్షించాలని సూచించారు. ఇప్పటికే ప్రతి పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక పోలీస్ అధికారులను నియమించామని వెల్లడించారు. జిల్లాలో మిస్ అవుతున్న బాలికలు మరియు మహిళల సమాచారాన్ని సమగ్రంగా సేకరించి, నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ తప్పిపోయిన వారిని త్వరితగతిన గుర్తించి రక్షించాల్సిన అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి టి వెంకట రమణ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏ. పద్మ వసుంధర, జిల్లా కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ షేక్ గౌస్ బాషా, జిల్లా బాలల సంరక్షణ అధికారి పి దినేష్ కుమార్, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బివి సాగర్, జిల్లా యాంటీ ట్రాఫికింగ్ యూనిట్ అధికారి, దిశ పోలీస్ స్టేషన్ సీఐ నాగరాజు, సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ జంగం ఇగ్నేసియస్, శ్రీను (మద్దిపాడు), సీడీపీఓ ఇవాంజెలిన్, గిరిధర్ శర్మ, ప్రభుత్వ రిమ్స్ ఆసుపత్రి నర్సింగ్ విద్యార్థినులు, పోలీసు సిబ్బంది, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.




## సింహాచలంలో స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ఏలూరి





(షణ్ముఖ వెలుగు, సింహాచలం, జులై 30)

ఉత్తరాంధ్ర ఇలవేల్పు సింహాచల శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి వారిని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు గురువారం దర్శించుకున్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, సీఎం ప్రోగ్రామ్ కమిటీ కో–ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, బాపట్ల ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్ర వర్మ రాజు, పులివర్తి నాని, పుత్తా చైతన్య రెడ్డితో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ప్రజాప్రతినిధులకు ఆలయ అధికారులు, వైఖానస అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, రాష్ట్ర బెస్తా కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## నలుగురు ఇంటి దొంగల అరెస్టు రూ.18 లక్షల విలువైన బంగారు ఆభరణాలు రికవరీ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 30)

చెడు వ్యసనాలకు బానిసలై ఇంటిలో దొంగతనాలు చేసే నలుగురు దొంగలను అరెస్టు చేసి, దొంగతనం చేసిన సొత్తును రికవరీ చేసినట్లు ఒంగోలు డిఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక డిఎస్పీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు తాలూకు వివరాలను మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలోని కొండాయపాలెం గేటు వద్ద గల రామకృష్ణ నగర్ కు చెందిన గోపిశెట్టి సునీల్, పల్నాడు జిల్లా ముప్పాళ్ళ మండలం, మాదాల గ్రామానికి చెందిన తమ్మిశెట్టి ఆనంద్, అదే గ్రామానికి చెందిన తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం మరియు గ్రామానికి చెందిన మలమంతి సాయికుమార్ అనే వ్యక్తులు మద్దిపాడు మండలంలోని పై పాలెం లో తాళం వేసిరిన్న ఇంటిని పగటిపూట తాళం పగల కొట్టి, రూ.18 లక్షల విలువైన బంగారు ఆభరణాలు దొంగిలించినట్లు పోల సేకరించారు. వారి నుండి బంగారు లక్ష్మీ దేవి కాసుల హారం, బంగారు మామిడి పిందెల నెక్లెస్, బంగారు ఎర్రరాళ్ల నెక్లెస్, బంగారు సాదా రింగుల నెక్లెస్, బంగారు పూసల దండ, బంగారు ఉంగరాలు, బంగారు బ్రాస్లెట్, బంగారు లక్ష్మీదేవి డాలర్ మరియు రూపు, బంగారు చెంప సవరాలు జత, బంగారు పాపడి బిళ్ళ, హారాలు మీద వేసుకుని బంగారు కమ్మలు ఐదు జతలు, వెండి బిళ్ళలు మూడు, మొత్తం 212 గ్రాముల బరువు కలిగిన బంగారు నగల విలువ రూ.18,00,000 ఉంటుందని పోలీసులు తెలిపారు. అలాగే దొంగతనానికి వినియోగించిన ఇన్నోవా కారును కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో దొంగిలించబడిన సత్తు ఒక గోల్డ్ చైన్, ఒక గోల్డ్ రింగ్, ఒక గోల్డ్ కడియం ఐడిఎస్‌సి బ్యాంకు నరసరావుపేట బ్రాంచ్ నుండి స్వాధీనం చేసుకోవాల్సి ఉంది. కేసును త్వరగాతిగా ఛేదించడంలో సహకరించిన ఒంగోలు రూరల్ సీఐ ఎం శేషగిరిరావు, మద్దిపాడు ఎస్ఐ జి వెంకట సూర్య, పోలీసు సిబ్బందిని రాయపాటి శ్రీనివాసరావు అభినందించి రివార్డులకు సిఫార్సు చేశారు.

## ప్రజాస్వామ్యం పై పోలీసు దాడి మోడీ పాలనలో అప్రకటిత ఎమర్జెన్సీ

### సీపీఎం కేంద్ర కార్యాలయంలోకి పోలీసుల చొరబాటు పై భగ్గుమన్న నిరసన

### నిరంకుశ పాలనకు నిదర్శనమంటూ భగ్గుమన్న నేతలు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 30)

ప్రజా ఉద్యమాల పట్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్షసాధింపు వైఖరిని మరింత తీవ్రతరం చేస్తోందని సీపీఎం నాయకులు మండిపడ్డారు. జంతర్‌మంతర్‌లో కొనసాగుతున్న ఉద్యమాన్ని బలహీనపరిచేందుకు పాత కేసులను సాకుగా చూపి విద్యార్థి నాయకులను అరెస్టు పేరుతో , సీపీఎం కేంద్ర కార్యాలయంలోకి ఢిల్లీ పోలీసులు అక్రమంగా చొరబడటం దేశ ప్రజాస్వామ్యం పైనే దాడి అని తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కడానికి పోలీసు యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడం మోడీ ప్రభుత్వ నిరంకుశ పాలనకు పరాకాష్ట అని విమర్శించారు. ఈ ఘటనను నిరసిస్తూ గురువారం సాయంత్రం ఒంగోలు బస్‌స్టాండ్ సమీపంలోని సాగర్ హోటల్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్కే మాబు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి వి కొండారెడ్డి మాట్లాడుతూ, జంతర్‌మంతర్ ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకురాలు ఐష్ ఘోష్‌పై ఐదేళ్ల నాటి కేసును తెరపైకి తీసుకువచ్చి అరెస్టు పేరున జాతీయ పార్టీ కార్యాలయంలో కి చొరబాటు రాజకీయ కక్షసాధింపేనని ఆరోపించారు. ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలోనే భయభ్రాంతులకు గురిచేయాలనే ఉద్దేశంతో ఢిల్లీ పోలీసులను ప్రయోగించారని విమర్శించారు. ప్రజా ఒత్తిడికి కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సిన పరిస్థితి రావడాన్ని జీర్ణించుకోలేక ప్రజాస్వామ్య పద్ధతులను పక్కనబెట్టి అణచివేత మార్గాన్ని ఎంచుకుందని అన్నారు. సీపీఎం కేంద్ర కార్యాలయంలోకి పోలీసుల చొరబాటు రాజ్యాంగ హక్కులపై ప్రత్యక్ష దాడి అని, ఇది దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీని గుర్తు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ఉద్యమాలను అణచివేయడానికి తప్పుడు కేసులు బనాయించడం, పోలీసు బలగాలను రాజకీయ ప్రయోజనాలకు వినియోగించడం ఫాసిస్టు ధోరణికి నిదర్శనమన్నారు. ప్రజల కోసం పోరాడే శక్తులను నిర్బంధాలతో అడ్డుకోలేరని, అణచివేత ఎంత పెరిగితే ప్రజా ప్రతిఘటన అంత బలపడుతుందని హెచ్చరించారు. సీపీఎం కేంద్ర కార్యాలయంలోకి చొరబడిన పోలీసు అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్న కక్షసాధింపు రాజకీయాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కంకణాల ఆంజనేయులు, బంకా సుబ్బారావు, కాలం సుబ్బారావు, జయంతి బాబు, సిహెచ్ మంజుందర్, వి బాలకోటయ్య, జి రమేష్, ఘట్టమనేని శ్రీనివాసరావు, జి శేషయ్య, తంబి శ్రీనివాస్, కె రమాదేవి, ఆదిలక్ష్మి, భక్తసింగ్‌రాజు, స్వామిరెడ్డి, వి మాలకొండయ్య, సయ్యద్ హుస్సేన్ ,కె.ఎఫ్. బాబు, టి మహేష్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## మానవ అక్రమ రవాణా నిర్మూలన సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యత

### జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జులై 30)

మానవ అక్రమ రవాణా నిర్మూలన సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో 'వెట్టి విమోచన కొఅలిషన్ నెట్వర్క్' స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కలెక్టర్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 'ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం' పురస్కరించుకుని రూపొందించిన ప్రత్యేక ప్రచార పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తామని అతిగా ఆశ చూపే వారిని నమ్మి మోసపోవద్దన్నారు. పిల్లలను ఒంటరిగా వదలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా పెళ్లి పేరుతో జరిగే మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని వ్యాఖ్యానించారు. ఇటువంటి విషయాల్లో అనుమానం వస్తే, పోలీసులను సంప్రదించాలన్నారు. అదే విధంగా సమాజంలో, ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల వద్ద మానవ అక్రమ రవాణా వంటి అమానుష చర్యలపై విస్తృత అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బాధితులకు అండగా నిలుస్తూ, ఈ రుగ్మతను సమూలంగా నిర్మూలించేందుకు స్వచ్ఛంద సంస్థలు మరియు ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 'వెట్టి విమోచన కొఅలిషన్ నెట్వర్క్' సంస్థ సభ్యులు అనీల్ రాజు, ఏలీయా, సాడ్స్ ప్రతినిధి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక పై శిక్షణ కార్యక్రమం






**(షణ్ముఖ వెలుగు, బ్రహ్మంగారి మఠం, జులై 30)**

గ్రామస్థాయి అవసరాలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించుటకు మంచి గ్రామస్థాయి ప్రణాళిక సిద్ధం చేయాలని మండల పరిషత్ అధ్యక్షులు సి వీరనారాయణరెడ్డి తెలిపారు. గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీలో భాగంగా శిక్షణ కార్యక్రమాన్ని గురువారం మండల పరిషత్ కార్యాలయ సభా భవనం, బి మటం నందు నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి మండల పరిషత్ అధ్యక్షులు సి వీరనారాయణరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామచంద్రారెడ్డి, పరిపాలన అధికారి, ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి (గ్రామపంచాయతీలు), ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి(జిఎస్‌డబ్ల్యూఎస్), మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు, మండలస్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు, ఇంజనీరింగ్ సహాయకులు, విఓఏ సభ్యులు పాల్గొన్నారు.

## ఇంటింటికి తెలుగుదేశం
## ప్రజల గుండెల్లో కూటమి ప్రభుత్వం
### టిఎన్‌టిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు గోగినేని రామారావు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 30)**

రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమంలో భాగంగా, గౌరవ ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు సూచనల మేరకు ఒంగోలు నగరంలోని 35వ డివిజన్, 153వ బూత్ పరిధిలో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రజలు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై సానుకూల స్పందన వ్యక్తం చేస్తూ ప్రభుత్వ పనితీరును అభినందించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తున్న కూటమి ప్రభుత్వానికి తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల అనురాధ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామరాజుగడ్డ కుసుమకుమారి, బూత్ కో-కన్వీనర్ గూడూరు మురళీకృష్ణ, అబ్బురి వెంకటేశ్వర్లు, గుండెబొమ్మ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

## బాలల చట్టాలు, హక్కుల పై అవగాహన కలిగి ఉండాలి
### అంగన్వాడీ వర్కర్ షేక్ హసీనా సేవలను అభినందించిన సీడీపీవో శ్రీదేవి



**(షణ్ముఖ వెలుగు, బద్వేలు, జులై 30)**

మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు కడప ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని మహబూబ్ నగర్ కాలనీ ఉర్దూ పాఠశాల నందు అంగన్వాడీ టీచర్ షేక్ హసీనా ఆధ్వర్యంలో "బేటీ బచావో - బేటీ పడావో" అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీవో (సీడీపీఓ) శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థినులకు బాలల పరిరక్షణ చట్టాలు, చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098 వినియోగం, మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా అందుతున్న వివిధ సంక్షేమ పథకాలు, సేవల గురించి విస్తృతంగా వివరించారు. విద్యార్థులు మంచి ప్రవర్తన, అలవాట్లను అలవర్చుకోవాలని, సమాజంలో జరుగుతున్న పరిణామాల పై అవగాహన కలిగి ఉంటూ చదువుపై శ్రద్ధ, ఆసక్తి, పట్టుదలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహబూబ్ నగర్ కాలనీ పరిధిలో అంగన్వాడీ వర్కర్ షేక్ హసీనా అందిస్తున్న విశేష సేవలను, విధుల్లో ఆమె చూపిస్తున్న నిబద్ధతను సీడీపీవో శ్రీదేవి ప్రత్యేకంగా కొనియాడి, అభినందించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ అరుణ, అంగన్వాడీ వర్కర్లు షేక్ హసీనా, షాభిరుణ్, లక్ష్మి నరసమ్మ, శైలజ, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఘనంగా పదవి విరమణ వీడ్కోలు సభ నరసింహారావు పాఠశాలకు అందించిన సేవలు అసాధారణం

## ఉద్యోగం నుండే విరమణ.... విద్యార్థుల హృదయాల నుండి కాదు

**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జులై 30)**

సుద్ధపల్లి నరసింహారావు మాష్టారు ఉద్యోగం నుంచి మాత్రమే విరమణ పొందుతున్నరని, విద్యార్థుల హృదయాల నుండి కాదని,ఎన్సిసి ఆఫీసర్‌గా, ఓపెన్ స్కూల్ సొసైటీ, జన విజ్ఞాన వేదిక ద్వారా ఆయన చూపిన క్రమశిక్షణ, నిబద్ధత, అందించిన సేవలు, చూపిన మార్గం పాఠశాలకు ఎల్లప్పుడూ ఆదర్శం అని మండల విద్యాధికారులు బి. అజయ్, కోటేశ్వరరావులు పేర్కొన్నారు.స్థానిక చిన్నగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 37 సంవత్సరాలు ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ గా పనిచేస్తూ గురువారం ఉద్యోగ విరమణ చేయ్యనున్న సుద్ధపల్లి నరసింహారావును పాఠశాల అవరణలో మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారులు అజయ్ బాబు , కోటేశ్వరరావు, ఓడరేవు హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు రత్న కుమారి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఇ సందర్భంగా సుద్ధపల్లి నరసింహారావు దంపతులను ఘణంగా సన్మానించారు.అనంతరం వక్తలు మాట్లాడుతూ నరసింహారావు మాస్టారు అంకిత భావాన్ని సమాజ సేవ ను ఎన్సీసీ ద్వారా మరియు జన విజ్ఞాన వేదిక ద్వారా చేసిన సేవలను కొనియాడారు. 37 సంవత్సరాలు సర్వీస్ లో 30 సంవత్సరాలు చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేయటం గొప్పతనమని కొనియాడారు. పాఠశాలలు ఉపాధ్యాయునిగా విద్యార్థులకు న్యాయం చేయటంతో పాటు ఎన్సిసి ఆఫీసర్ గా మరియు ఎందరో విద్యార్థినీ విద్యార్థులకు ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పదవ తరగతి ,ఇంటర్మీడియట్ కోర్సులను పూర్తి చేయించి ఆదర్శంగా నిలిచారని విరమణ అనంతర విశ్రాంతి జీవితం ఆయురారోగ్యాలతో, ప్రశాంతంగా సాగాలని అకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు అజయ్ బాబు , కోటేశ్వరరావు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, ఓడరేవు హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు రత్న కుమారి, మండలంలోని ఇతర పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.






# మైదుకూరు సమీపంలో తీవ్ర విషాదం

## చేపల వేటకు వెళ్లి కరెంట్ షాక్‌తో బాలుడు మృతి

**(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జులై 30)**



చేపల వేటకు వెళ్లిన తండ్రీకొడుకులలో విద్యుత్ షాక్‌కు గురై 15 ఏళ్ల బాలుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన విషాద సంఘటన మైదుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మైదుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కోనాయిపల్లి గ్రామానికి చెందిన చందా పెద్ద వెంకటస్వామి (40), ఆయన కుమారుడు అఖిల్ (15) గురువారం ఉదయం 9.30 గంటల సమయంలో చేపలు పట్టేందుకు పొరుగున ఉన్న లింగాలదిన్నె గ్రామంలోని చెరువు వద్దకు వెళ్లారు.

చేపలను త్వరగా పట్టేందుకు పక్కనే ఉన్న రైతుల పొలాల కరెంట్ తీగల నుంచి అక్రమంగా చెరువు నీటిలోకి వైర్ కనెక్షన్ ఇచ్చారు. నీటిలో కరెంట్ ప్రసరించి చేపలు చనిపోయిన అనంతరం, ఆ వైర్లను తొలగించే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగలడంతో అఖిల్ (15) తీవ్ర విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో బాలుడు నీటిలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు.

**ఇంటి వద్ద విషాదఛాయలు :**

ప్రమాదం జరిగిన వెంటనే మృతదేహాన్ని స్వగ్రామమైన కోనాయిపల్లికి తీసుకువచ్చారు. బాలుడి మరణంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో శోకసంద్రం అలుముకుంది.



**కేసు నమోదు చేసిన పోలీసులు :**

ఈ సంఘటనపై మైదుకూరు సి.ఐ. రమణారెడ్డి స్పందిస్తూ సమాచారం అందుకున్న వెంటనే ఘటనపై వివరాలు సేకరించామని తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసి పూర్తిస్థాయి విచారణ జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు

## వినూత్న ఆవిష్కరణలకు వేదికగా "స్టార్ట్ అప్ కడప"
### ల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి





**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జులై 30)**

సరికొత్త ఆలోచనలు, వినూత్న ఆవిష్కరణలకు వేదికగా జిల్లా యువతను పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రూపుదిద్దుకుంటున్న "స్టార్ట్ అప్ కడప" ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సెంటర్ త్వరలో ప్రారంభానికి సిద్ధమవుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, సబ్ కలెక్టర్ హెచ్ఎస్ భావనతో కలిసి నిర్మాణ పనులను పూర్తి చ్చేసుకుని చకచకా జరుగుతున్న ఫినిషింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భవనం బాహ్య నిర్మాణ పనులను వారంలోపు పూర్తి చేసి, వెంటనే అంతర్గత సదుపాయాల ఏర్పాటును వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా పనులను పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఇంటి నుంచి ఒక స్టార్టప్ ఆవిర్భవించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా "స్టార్ట్ అప్ కడప" రూపుదిద్దుకుంటోందన్నారు. ఇది కేవలం ఒక భవనం కాదన్నారు. యువత ఆలోచనలకు, ఆవిష్కరణలకు, కొత్త వ్యాపారాల ఆరంభానికి బలమైన వేదికగా నిలవనుందన్నారు. ఈ కేంద్రం ద్వారా స్టార్టప్ వ్యవస్థాపకులు, ఫ్రీలాన్సర్లు, చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థలకు అవసరమైన మార్గదర్శకత్వం, ఆధునిక సదుపాయాలు, ప్రోత్సాహం లభిస్తాయని తెలిపారు. కడపను పారిశ్రామిక అవకాశాల కేంద్రంగా తీర్చిదిద్దడంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. నిర్మాణ పనుల పరిశీలనలో కేఎంసీ కమిషనర్ భవానీ ప్రసాద్, హౌసింగ్ ఇంజనీర్లు, ఏడీపీ యంగ్ ప్రొఫెషనల్స్ తదితరులు పాల్గొన్నారు.

## ఒంగోలు జిఆర్‌పి ఎస్ఐ శ్రీరామ్‌కి తిరుపతి ఎస్పీ అభినందనలు




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 30)**

ఇటీవల తిరుమలలో దొంగిలించబడిన పవిత్ర ఆంజనేయస్వామి విగ్రహాన్ని చాకచక్యంగా స్వాధీనం చేసుకున్న ఒంగోలు జీఆర్‌పీ ఎస్ఐ శ్రీరామ్‌ను తిరుపతి జిల్లా పోలీసులు సత్కరించారు. ఈ కేసులో ఎస్ఐ తన అద్భుతమైన దర్యాప్తు నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానంతో ఒంగోలు రైల్వేస్టేషన్లో నిందితుడిని రికార్డు సమయంలో పట్టుకున్నారు. ఆయన అప్రమత్తతను అభినందిస్తూ తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు బుధవారం ఎస్ఐకి ప్రశంసా పత్రం అందజేశారు.

# ప్రమాదకర కూడళ్ల పై కలెక్టర్, ఎస్పీ ప్రత్యేక దృష్టి
## డ్రోన్ సర్వేలు, కఠిన భద్రతా చర్యలు



**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, జులై 30)**

పట్టణం పరిసర ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్న కూడళ్లను ప్రకాశం జిల్లా కలెక్టర్ పి రాజబాబు, జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు గురువారం సంయుక్తంగా పరిశీలించారు. బంగ్లా రోడ్డు, భవాని సెంటర్, ద్వారకానగర్, సింగరకొండ జంక్షన్, కొమ్మలపాడు, ఏల్చూరు, సంతమాగులూరు జంక్షన్లలో భద్రతా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో డ్రోన్ సర్వేలు నిర్వహించి ప్రమాదాలకు కారణమయ్యే అంశాలను గుర్తించి తక్షణ చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. రహదారులపై వాహనాలు నిలిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. గ్రామ కూడళ్ల వద్ద పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా వాహనదారులకు హెచ్చరికలు జారీ చేయడం, ఆక్రమణలు తొలగించడం, స్పీడ్ లిమిట్ బోర్డులు, హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సింగరకొండ మలుపు వద్ద తారు రహదారి వేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు, రోడ్లపై వాహనాల పార్కింగ్‌ను కఠినంగా నియంత్రించాలని పోలీసు అధికారులకు సూచించారు. గ్రామ కూడళ్ల వద్ద నిరంతరం అనౌన్స్‌మెంట్లు చేస్తూ వాహనదారులు, పాదచారులను అప్రమత్తం చేయాలని చెప్పారు. రంబుల్ స్ట్రిప్స్, కుంభాకార దర్పణాలు, మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. పరిశీలనలో టీటీసీ సుశీల, దర్శి డీఎస్పీ బాలమురళీకృష్ణ, డీసీఆర్‌బీ సీఐ దేవప్రభాకర్, అద్దంకి సీఐ సుబ్బరాజు, సంతమాగులూరు సీఐ శేషగిరిరావు, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, ఆర్అండ్‌బీ అధికారులు, ఎక్స్‌ప్రెస్ హైవే అధికారులు, తదితరులు పాల్గొన్నారు.









Printed by O Radhakrishna Dass On behalf of HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Published from Dr.No. 4-255, PANDARIPURAM CHILAKALURIPET H/O, PURUSHOTHA PATNAM CHILAKALURIPET, GUNTUR, ANDHRA PRADESH - 522616. Mobile : 9494177939, RNI : APTEL/25/A2455, E-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com.

# మాదిగ బాలిక కిడ్నాప్ కేసులో
# కిడ్నాపర్‌ను అరెస్టు చేయాలి

**కిడ్నాపర్‌కు సహాయ పడుతున్న ఉలవపాడు ఎస్ఐ ని సస్పెండ్ చేయాలి**
**తెలిసిన కిడ్నాపర్‌ని అరెస్టు చేయలేని ఎస్ఐ**
**తెలియని నేరస్తులను అరెస్టు చేయగలరా ?**
**జిల్లా ఎస్పీని కోరిన దళిత నేత నీలం**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 30)**

కిడ్నాప్ కు గురైన మాదిగ బాలిక కేసులో కిడ్నాపర్ పాలకీర్తి వెంకట్రావును అరెస్టు చేయాలని 55 రోజుల పాటు గొడుగు పట్టిన ఉలవపాడు ఎస్ఐ సుబ్బారావును సస్పెండ్ చేయాలని ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజును దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు కోరారు. గురువారం సాయంత్రం ఒంగోలు గవర్నమెంట్ హాస్పిటల్‌లో సఖి సెంటర్లో వైద్య చికిత్స పొందుతున్న కిడ్నాపర్‌కు గురైన బాలిక తల్లి మరలపాటి రోదియా బంధువులతో కలసి నీలం నాగేంద్రరావు మీడియాతో మాట్లాడారు. మే నెల 28వ తేదీన ఉలవపాడు మండలం వీరేపల్లి గ్రామానికి చెందిన మరలపాటి రోదియా కూతురు ఇంటర్ చదివిన మైనర్ బాలికను అదే గ్రామానికి చెందిన పాలకీర్తి వెంకట్రావు ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి కిడ్నాప్ చేసి తీసుకుని వెళ్లాడని అన్నారు. ఈ ఘటన జూన్ 3వ తేదీన ఫిర్యాదు చేయగా ఉలవపాడు ఎస్ఐ సుబ్బారావు మొక్కుబడిగా బాలిక మిస్సింగ్ కేసుగా క్రైమ్ నెంబర్ 60/26 గా నమోదు చేశారన్నారు. తమ బిడ్డ ఆచూకీ చెప్పాలని పోలీస్ స్టేషన్ కు వెళ్లిన రోదియా వాళ్ళ బంధువులను ఉలవపాడు ఎస్ఐ సుబ్బారావు అవమానకరంగా మాట్లాడి బెదిరించాడన్నారు. ఉలవపాడు ఎస్ఐ కిడ్నాపర్ పాలకీర్తి వెంకట్రావుకు గొడుగు పడుతున్నాడని, ఉన్నతాధికారులైన కందుకూరు సిఐ అన్వర్ భాష, కందుకూరు



డిఎస్పీ బాలసుబ్రమణ్యానికి ఫిర్యాదు చేసిన వారు కూడా ఉలవపాడు ఎస్ఐ ఖాకి కథకు వంత పాడారన్నారు. అంతట ఒంగోలు వచ్చి దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావును ఆశ్రయించారు. అదే రోజు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు ఫిర్యాదు చేసిన ఉలవపాడు ఎస్ఐ ఉన్నతాధికారులను కూడా చిన్నగంజాం కథ చెప్పి కేసును తప్పుదారి పట్టించారన్నారు. అంతట నీలం నాగేంద్రరావు ఈనెల 21న హైకోర్టులో బాలిక తల్లి మర్లపాటి రోదియా చేత హె వీఎస్ కార్పస్ పిటిషన్ వేయించారన్నారు. అదేరోజు హైకోర్టు విషయం తెలిసి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కిడ్నాప్ కేసుగా ఉలవపాడు ఎస్ఐ కేసు మార్చారన్నారు. హైకోర్టులో హె బిఎస్ కార్పస్ పిటిషన్ వేస్తేనే కిడ్నాప్ కేసుగా ఎందుకు మార్చారనని ప్రశ్నించారు. అంతట ఉలవపాడు హైకోర్టులో న్యాయవాదిని కూడా మాయ చేసాడన్నారు. మరల నీలం నాగేంద్రరావు పట్టు వదలక మరో హైకోర్టు న్యాయవాదిని హైకోర్టు రిపోర్ట నుఉపయోగించి మరల హెవీఎస్ కార్పస్ పిటిషన్ కు రెడీ చేశాడు. ఈ విషయం తెలుసుకున్న ఉలవపాడు ఎస్ఐ హుటాహుటిన బుధవారం 60 రోజులు కనిపించని మైనర్ బాలికను కిడ్నాపర్ పాలకీర్తి వెంకట్రావును తెచ్చి ఉలవపాడు పోలీస్ స్టేషన్లోకి తీసుకొని రాకుండా ఒంగోలు ఎస్పీ కార్యాలయంలోని గెలాక్సీ హాల్లో బుధవారం అంతా విచారణ పేరుతో కాలయాపన చేశారన్నారు. రాత్రి వైద్య చికిత్స నిమిత్తం ఒంగోలు గవర్నమెంట్ హాస్పిటల్‌కి బాలికను వారి బంధువులను పంపించారు. గురువారం వైద్య చికిత్సలు మొత్తం పూర్తయ్యాయి. కావున మాదిగ మైనర్ బాలిక కేసులో 55 రోజుల పాటు కిడ్నాపర్‌తో కుమ్మక్కై అరెస్టు చేయని ఉలవపాడు ఎస్ఐ సుబ్బారావును సస్పెండ్ చేయాలని, అలాగే కిడ్నాపర్‌ను ఫోక్సో, కిడ్నాప్ కేసుల కింద అరెస్టు చేయాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజును దళిత నాయకులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాను రవి, మాల సభ కన్వీనర్ మేడికొండ మురళి, కందుల దేనేలు, బాలిక బంధువులు ఉన్నారు.

---

# ఎల్‌నినో పై అధికారులతో సమీక్ష సమావేశం!

**(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, జులై 30)**

కొరిశపాడు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే




వర్షాభావ పరిస్థితులపై సమీక్ష నిర్వహించిన ఆమె, రైతులు వరి సాగు చేసి నష్టపోకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించేలా రైతులకు సూచనలు చేయాలని, పశువులకు మేత కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. హార్టికల్చర్ శాఖ అధికారులు పండ్ల తోటలు సాగు చేస్తున్న రైతులకు సూక్ష్మ నీటిపారుదల, నీటి పొదుపు పద్ధతులపై అవగాహన కల్పించాలని తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

---

# కడవకుదురులో
# రెండేళ్ల నమ్మకం-సంక్షేమం-అభివృద్ధి





**కూటమి శ్రేణులకు గ్రామస్తులు ఘన స్వాగతం**
**సంక్షేమ, అభివృద్ధి పథంలో అగ్రగామి**
**కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి**
**మధ్య సమతుల్యత సాధించింది - నక్కల రాఘవ**

**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జులై 30)**

రాష్ట్రాన్ని సంక్షేమ, అభివృద్ధి పథంలో అగ్రగామిగా నిలబెట్టేందుకు సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని బాపట్ల జిల్లా తెదేపా కార్యదర్శి నక్కల వీరరాఘవులు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల పాలన విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా చిన్నగంజాం మండలం కడవకుదురు గ్రామంలో నిర్వహించిన రెండేళ్ల నమ్మకం-సంక్షేమం -అభివృద్ధి కార్యక్రమంలో బాపట్ల జిల్లా తెదేపా కార్యదర్శి నక్కల వీరరాఘవులు పాల్గొని రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ కరపత్రాలను పంచారు.

**కూటమి శ్రేణులకు గ్రామస్తులు ఘన స్వాగతం :** ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గ్రామస్తులు నక్కల వీరరాఘవుల అధ్వర్యంలో కూటమి శ్రేణులకు ఏదురేగి స్వాగతం పలికి కూటమి సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా తమ జీవితాల్లో చోటుచేసుకున్న సానుకూల మార్పులను హృదయపూర్వకంగా వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తమ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే కాకుండా కొత్త ఆశలను నింపాయని వారు ఆనందం వ్యక్తం చేశారు.

**కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతుల్యత సాధించింది- రాఘవ :** ఈ సందర్భంగా నక్కల వీరరాఘవులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతుల్యత సాధించిందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుందని పేర్కొన్నారు. దీపం2 పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, తల్లికి వందనం పథకం ద్వారా లక్షలాది కుటుంబాలకు ఆర్థిక చేయూత అందించడంతో పాటు మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలకు శ్రీకారం చుట్టడం వంటి నిర్ణయాలు ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని అన్నారు.భవిష్యత్తులో కూడా రాష్ట్రంలో చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం,పర్చూరులో ఏలూరి ప్రజల ఆశీర్వాదంతో మరో 15 సంవత్సరాల పాటు విజయవంతంగా పాలన కొనసాగిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతంగా అమలు చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వడ్లమూడి శ్రీనివాసరావు, డి రామకృష్ణ, పి వెంకటేశ్వర్లు, లాయరు ఉదయ్ బాస్కరరావు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

---

# ఎన్‌హెచ్ 544డీ ప్రమాదకర ప్రాంతాల పై కలెక్టర్

**ఎం విజయ సునీత ఆధ్వర్యంలో సంయుక్త తనిఖీ**
**ప్రమాదాల నివారణకు తక్షణ భద్రతా చర్యలు చేపట్టాలి - అధికారులకు ఆదేశం**




**(షణ్ముఖ వెలుగు, కంభం జులై 30)**

మార్కాపురం జిల్లా బెస్తవారిపేట, కంభం మండలాల పరిధిలోని జాతీయ రహదారి ఎన్‌హెచ్-544డీలో గుర్తించిన ప్రమాదకర (బ్లాక్ స్పాట్) ప్రాంతాలను మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత ఆధ్వర్యంలో గురువారం సంయుక్తంగా పరిశీలించారు. ఈ తనిఖీలో డీఎస్పీ నాగరాజు, జాయింట్ కలెక్టర్, ఆర్‌టీఓ, జాతీయ రహదారి అధికారులు, కంభం సీఐ మల్లికార్జున, కంభం ఎస్సై శివ కృష్ణారెడ్డి, బెస్తవారిపేట ఎస్సై రవీంద్రారెడ్డి తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలు, మలుపులు, కూడళ్లు, దృశ్యమానత తక్కువగా ఉన్న ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు, రోడ్డు ప్రమాదాల నివారణకు వెంటనే భద్రతా చర్యలు చేపట్టాలని జాతీయ రహదారి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కీలక కూడళ్ల వద్ద హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టివ్ సైన్‌బోర్డులు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయడం, రంబుల్ స్ట్రిప్స్, స్పీడ్ బ్రేకర్లు నిర్మించడం, బ్లైండ్ కర్వ్‌ల సవరణ, దృశ్యమానతకు అడ్డుగా ఉన్న చెట్లు, పొదలను తొలగించడం, కూడళ్ల వద్ద విజిబిలిటీ మెరుగుపరచడం వంటి పనులను అత్యవసరంగా పూర్తి చేయాలని కలెక్టర్ విజయ సునీత ఆదేశించారు. జాతీయ రహదారి భద్రతా పనులు సకాలంలో పూర్తయ్యేలా పోలీసు శాఖ తరపున నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, జాతీయ రహదారి అధికారులతో సమన్వయం చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని సీఐ మల్లికార్జున, ఎస్ఐ శివ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ చర్యలతో ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించడమే లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు.







---

# ప్రధాని పర్యటనను విజయవంతం చేయడమే లక్ష్యం

**భోగాపురం ఏర్పాట్ల పై సమీక్షలో**
**ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు**



**(షణ్ముఖ వెలుగు, పర్చూరు, జులై 30)**

అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను పూర్తి స్థాయిలో చేపడుతోందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా జరగనున్న విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమం నేపథ్యంలో గురువారం భోగాపురం విమానాశ్రయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడారు. రాష్ట్ర మంత్రులు కింజారపు అచ్చెన్నాయుడు, బీసీ జనార్ధన్ రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యతో పాటు ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ, ప్రధానమంత్రి సభకు హాజరయ్యే లక్షలాది మంది ప్రజలు, నాయకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కట్టుదిట్టమైన భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లు సమర్థవంతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. తాగునీరు, ఆహారం, ఇతర మౌలిక సదుపాయాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు చెప్పారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి నూతన దిశానిర్దేశం చేసే కీలక ప్రాజెక్టుగా నిలుస్తుందన్నారు. ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం పూర్తి సన్నద్ధంగా ఉందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు.

---

# మానవ అక్రమ రవాణాను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత

**ప్రపంచ మానవ అక్రమ రవాణా**
**వ్యతిరేక దినోత్సవం**
**సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు**




**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 30)**

ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కనిగిరి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జడ్జి బి. రూపశ్రీ నేతృత్వంలో మండల న్యాయ సేవాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ వెట్టి విమోచన కూటమి, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కనిగిరి ఆర్టీసీ బస్టాండ్‌లో విద్యార్థులకు, ప్రయాణికులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పారా లీగల్ వాలంటీర్, వి.వి.సి. కనిగిరి డివిజన్ కన్వీనర్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ ఎం. రమేష్ బాబు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాను అరికట్టడంలో ప్రజల అప్రమత్తత, సమాజ సహకారం ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించి ఈ సామాజిక దురాచారాన్ని నిర్మూలించేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మానవ అక్రమ రవాణా భారతదేశంలో అత్యంత ప్రమాదకరమైన నేరాల్లో ఒకటిగా మారిందన్నారు. అమాయకులను మోసపూరితంగా వివిధ రాష్ట్రాలు, దేశాలకు తరలించి బలవంతపు శ్రమ, లైంగిక దోపిడీ, ఇతర అక్రమ కార్యకలాపాలకు గురిచేస్తున్నారని తెలిపారు. బస్టాండ్ పరిసరాల ప్రాంతంలో అపరిచితులు ఇచ్చే ఆహారం, పానీయాలు తీసుకోకూడదని, ఉద్యోగాల పేరుతో వచ్చే తప్పుడు ఆఫర్లను నమ్మరాదని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా మానవ అక్రమ రవాణా జరుగుతున్నట్లు అనుమానం వచ్చినా లేదా సమాచారం తెలిసినా వెంటనే ఉపాధ్యాయులకు, పోలీసులకు, సంబంధిత అధికారులకు తెలియజేయాలనికోరారు. పోలీస్ అత్యవసర సేవ 100, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, వన్ నేషన్ వన్ నంబర్ 112, న్యాయ సేవాధికార సంస్థ టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ 15100 నంబర్లకు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని వివరించారు.